


భారత్ ప్రతినిధి

తెలుగు దిన పత్రిక









సంపుటి: 3 సంచిక: 319 పేజీలు: 8 సంపాదకులు: రోళ్ళ రఘునాథ్ రెడ్డి ప్రచురణ: గుంటూరు శుక్రవారం, 11 సెప్టెంబర్ 2026 వెల: 2 రూ/- RNI No: APTEL/2023/88990

VOLUME: 3 ISSUE: 319 PAGES: 8 EDITOR: ROLLA RAGHUNATH REDDY PUBLISHED: GUNTUR FRIDAY, 11 SEPTEMBER 2026 PRICE: 2 Rs/- BHARATH PRATHINIDHI


# పేదల సొంతింటి కల నెరవేర్చాలి ..

## కలెక్టర్లకు సీఎం చంద్రబాబు ఆదేశం



**అమరావతి:** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు లేదా ఇంటి స్థలం పట్టా అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణం, పేదల ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాల క్రమబద్దీకరణపై అమరావతిలో ఈ రోజు (గురువారం) జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన సమీక్షించారు. ఈ ప్రక్రియను ఏడాదిలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 1.43 లక్షల మందిని ఇళ్ల పట్టాలకు అర్హులుగా గుర్తించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరో 1.26 లక్షల దరఖాస్తులను పరిశీలిస్తున్నామని, అక్టోబర్ 15 నాటికి వాటన్నింటినీ పూర్తిచ స్తామన్నారు. 1,692 గ్రామాల్లో సుమారు 18 వేల మందికి ఇంటి పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన భూమిని ఇప్పటికే గుర్తించామని వివరించారు. కొత్తగా ఎంతమందికి ఇళ్ల పట్టాలి వ్వాలి? ఎంతమంది ఇళ్ల స్థలాలను క్రమబద్దీకరించాల్సి ఉందనే అంశంపై పక్కాగా లిస్ట్ ప్రిపేర్ చేయాలని సీఎం ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పట్టాలు పంపిణీ చేయాలని సూచించారు.ఏపీలో గృహ నిర్మాణ పురోగతి వివరాలపై చంద్రబాబు ఆరా తీయగా.. ఇప్పటివరకు 5.92 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తైనట్టు అధికారులు తెలిపారు. మరో 5.32 లక్షల ఇళ్లు ఆయా దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. నిర్మాణంలో ఉన్న అన్ని గృహాలనూ వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేసి లబ్ధిదారులకు ఇచ్చే ఏర్పాట్లు చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఇళ్ల నిర్మాణం, ఇంటి పట్టాల పంపిణీ విషయంలో కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేసిన ఆయన.. 10 రోజుల్లో సమగ్ర యాక్షన్ ప్లాన్‌తో రావాలని ఆదేశించారు.ఇంటి నిర్మాణం, పట్టాల అంశాలకు జిల్లా కలెక్టర్లు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తిచేసేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలని సూచించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులు కూడా చొరవ తీసుకుని అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఇందుకోసం టైమ్‌బౌండ్ ప్రోగ్రాం రూపొందించి అమలు చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన పేదలకు ఇళ్లు, ఇంటి స్థలం అందించడం ప్రభుత్వ ప్రాధాన్యాల్లో ఆదేశించారు.

# మమల్ని గెలిపిస్తే 5 వేల డాలర్ల చొప్పున ఇస్తాం

## : ట్రంప్



**అమెరికా:** అమెరికాలో త్వరలో మిడ్‌టర్మ్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో గెలిచి తీరాలని పట్టుదలతో ఉన్న అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ తాజా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈసారి చట్టసభల్లో తమకు మెజారిటీ దక్కేలా చేస్తే పయోజనులైన అమెరికన్లకు ఒక్కొ క్కరికీ 5 వేల డాలర్ల చొప్పున ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ చెల్లింపులకు ట్రంప్ డివిడెండ్ అని కూడా ఆయన పేరుపెట్టారు. 'డివిడెండ్' ఇచ్చేం దుకు అధ్యక్షుడు ట్రంప్ ఓ షరతు కూడా విధించారు. ఈ డబ్బును అమెరికాలో మాత్రమే ఖర్చు పెట్టాలని స్పష్టం చేశారు. 'ఈ డబ్బును మీరు కెనడాలో ఖర్చు పెట్టకూడదు. చైనా, జర్మనీ పర్యటనలకు వెళ్లి ఖర్చు చేయకూడదు. అమెరికాలోనే ఈ డబ్బును వినియోగించాలి' అని అన్నారు. ఓటింగ్ సరళిని ప్రభావితం చేసేలా ట్రంప్ ఇలా బహిరంగంగా ఓటర్లకు డబ్బు ఆశ చూపించడం అమెరికాలో కలకలానికి దారి తీసింది.

# అసెంబ్లీ ఘటనపై సర్కార్ ఫ్లాష్ సర్వే..

## బీఆర్ఎస్ తీరును ప్రజలు తప్పుపట్టారన్న సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్:**తెలంగాణలో గత 3 రోజుల పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం ఫ్లాష్ సర్వే నిర్వహించిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ ఘటనల్లో రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత కంటే బీఆర్ఎస్ నేతల తీరునే ప్రజలు తప్పుబట్టినట్లు సర్వేలో తేలిందని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీలో సభ్యుల హాజరు, వ్యక్తిగత పనితీరు, నియోజకవర్గ సమస్యలను సభలో ప్రస్తావించడం వంటి అంశాలపై ఎమ్మెల్యేలకు.. సీఎల్పీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు సూచించారు.తెలంగాణ అసెంబ్లీ వేదికగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం మరింత వేడెక్కింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశంలో ఇటీవల అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, ప్రతిపక్షాల వ్యవహారశైలి, ప్రభుత్వ భవిష్యత్ వ్యూహంపై కీలకంగా చర్చించినట్లు సమాచారం. ఈ సందర్భంగా గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించినట్లు చెబుతున్న ఓ ఫ్లాష్ సర్వే ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల ముందు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలపై ప్రభుత్వం.. ఫ్లాష్ సర్వే చేయించిందని సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో తెలిపారు. ఆ సర్వేలో రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత కనిపించలేదని.. బదులుగా బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలినే ప్రజలు తప్పుబట్టినట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీన అసెంబ్లీ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వివాదం.. ఎర్రవల్లిలో చోటుచేసుకున్న శుద్ధీకరణ కార్యక్రమం వంటి అంశాలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో ప్రస్తావించినట్లు సమాచారం. ఈ ఘటనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా ఎమ్మెల్యేలకు వివరించినట్లు తెలుస్తోంది.
ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ అసెంబ్లీ కార్యకలాపాలను సజావుగా సాగనివ్వకుండా కుట్ర చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించినట్లు సమాచారం. మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఫామ్‌హౌస్‌లో సమావేశమై సభను అడ్డుకునే వ్యూహాన్ని రూపొందించారని ఆయన విమర్శించినట్లు తెలుస్తోంది. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు సమాచారం.

## సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన

# సీఎల్పీ సమావేశం..



**హైదరాబాద్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ కమిటీ హాల్లో జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహం, ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడం వంటి అంశాలపై చర్చించారు. అలాగే ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణపైనా చర్చలు జరిగాయి.ఈ సందర్భంగా శాసనసభను సజావుగా సాగనివ్వకుండా ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుట్ర చేసిందని సీఎం రేవంత్ ఆరోపించారు. ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ అధ్యక్షతన అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకునే వ్యూహం రూపొందించారని విమర్శించారు. అధికారం కోల్పోయినా వారు అహంకారం వీడలేదని మండిపడ్డారు. పోలీసు సిబ్బందిలో కేటీఆర్‌కు తాను కనిపించినట్టు ఉన్నానని, అంత ఆక్రోశంతో వారిపై ఆయన దాడులు చేశారని పేర్కొన్నారు. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులపై అనుచితంగా వ్యవహరించారని, మహిళా అధికారుల ఎదుట చొక్కాలు విప్పి ఇబ్బంది కలిగించారని మండిపడ్డారు. శాసనసభాపతినీ అత్యంత అభ్యంతరకరంగా దూషించారని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ నుంచి రాజకీయంగా ఎదిగి ఆ పార్టీకి నష్టం చేకూర్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని సీఎం విమర్శించారు.

## ఆర్టీసీని నిర్వీర్యం చేసిన

# బీఆర్ఎస్ ప్రభుత్వం

## : మంత్రి పొన్నం



**హైదరాబాద్, సెప్టెంబర్ 10:** ఆర్టీసీ పేద ప్రజలకు లైఫ్ లైన్ లాంటిదని తెలంగాణ రోడ్డు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకార్ అభివర్ణించారు. గురువారం అసెంబ్లీలో ఆర్టీసీపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. హైదరాబాద్‌లో మినీ ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని చూస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరంలో 540 ఎలక్ట్రికల్ బస్సులు నడుస్తున్నాయని వివరించారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన రోజే అసెంబ్లీ నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు.గత ప్రభుత్వం టీజీఎస్ఆర్టీసీని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఆర్టీసీ డిపోలలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. యాదాద్రి జిల్లాలోని వంగపల్లి మండలంలో ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆగే విధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే ఆసిఫాబాద్, కాగజ్ నగర్‌లో ఆర్టీసీ డిపోల సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

## ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై అసెంబ్లీలో చర్చ..

# భట్టి విక్రమార్క ఏం చెప్పారంటే..



**హైదరాబాద్:** తెలంగాణలో ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. రిజర్వాయర్లపై సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు విద్యుత్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా అధ్యయనం చేస్తున్నాయని చెప్పారు. నాగార్జునసాగర్, శ్రీశైలం సహా పలు రిజర్వాయర్లను పరిశీలిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా సభ్యులు సోలార్ పవర్‌పై ప్రశ్నలు లేవనెత్తారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి వివరణ ఇస్తూ కీలక విషయాలను వెల్లడించారు.
ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు తమ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుందని తెలిపారు. అయితే, దీనికి అధిక వ్యయం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల కారణంగా ఒక్క మెగావాట్‌కు రూ.1.30 కోట్ల అదనపు భారం పడుతోందని తెలిపారు. కేంద్రం నిబంధనలు సడలిస్తే పెట్టుబడులు మరింత పెరుగుతాయని భట్టి పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు చేరిందని.. పారిశ్రామిక వృద్ధితో డిమాండ్ భారీగా పెరుగుతోందన్నారు. మరోవైపు, విద్యుత్ సబ్సిడీల కోసం ఏటా రూ.19 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు.అలాగే, సోలార్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపైనా కాంగ్రెస్ సర్కార్ దృష్టి పెట్టిందని ఉప ముఖ్యమంత్రి భట్టి పేర్కొన్నారు. ఈ మేరకు అమ్రాబాద్‌లో 80 గ్రామాల సోలరైజేషన్‌కు పైలట్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాల్లో మైక్రో గ్రిడ్‌ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామని తెలిపారు. మరోవైపు, గిరిజన ప్రాంతాల్లో సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహిస్తామని చెప్పారు. ఇందుకోసం 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించి నట్లు వెల్లడించారు.

# ఛాత్రోన్ కీ గూంజ్

## ప్రచారాన్ని వేగవంతం చేస్తున్న రాహుల్



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సెప్టెంబర్ 19న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. దేశ విద్యా వ్యవస్థలోని లోపాలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడేందుకు రాహుల్ గాంధీ ఈ ప్రచారాన్ని వేగవంతం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 19న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో విద్యార్థులు, యు వతతో ఆయన నేరుగా సమా వేశం కానున్నారు.సోషల్ మీడియా వేదికగా 'జెన్ జీ' విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన రాహు ల్ గాంధీ, 'నా ప్రియమైన విద్యార్థులారా, యువతరమా.. దేశంలో దెబ్బతిన్న విద్యా వ్యవస్థ మీ ఆశల దివ్వెలను ఆర్పివేసి, భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తోంది' అంటూ ఆం దోళన వ్యక్తం చేశారు.ఈ వ్యవస్థలో మార్పు తీసుకురావడానికి ప్రతి విద్యార్థి స్వరం, వారి బా ధలు, సూచనలు వినడం ఎంతో అవసరమని రాహుల్ పేర్కొన్నారు. విద్యార్థులు తమ సమ స్యలను, సలహాలను పంచుకోవడానికి ప్రత్యేక లింక్‌ను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.

# విజయ్ కు ఈసీ బిగ్ న్యూస్

## టీవీకే పార్టీ, గుర్తుపై కీలక నిర్ణయం..!



**తమిళనాడు:** ఈ ఏడాది తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ఘన విజయం సాధించడమే కాకుండా, ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేసిన టీవీకే అధినేత విజయ్ కు కేంద్ర ఎన్నికల సంఘం ఇవాళ గుడ్ న్యూస్ చెప్పింది. విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కజగానికి 2024లో నమోదైన రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ ఇచ్చిన ఈసీ.. ఇవాళ రాష్ట్ర పార్టీగా గుర్తింపు నిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అలాగే టీవీకే గుర్తు విజిల్ ను ఆ పార్టీకి శాశ్వత చిహ్నంగా కూడా కేటాయించింది. దీంతో టీవీకే శ్రేణులు సంతోషంలో మునిగిపోయాయి. ఈసీ నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం విజయ్ సుదీర్ఘ ట్వీట్ పెట్టారు.నా హృదయంలో నిలిచిన తమిళనాడు ప్రజలందరికీ విజయ్ హృదయపూర్వక నమస్కారాలు తెలిపారు. మూడు దశాబ్దాలకు పైగా, మీరు నాపై అపారమైన ప్రేమను కురిపించారు, నా జీవితంలో ఒక అరుదైన, ఉన్నతమైన స్థానాన్ని కల్పించడమే కాకుండా, ప్రతి ఇంట్లోనూ, ప్రతి హృదయంలోనూ-ఒక కుటుంబ సభ్యుడిగా, బంధువుగా, కొడుకుగా, సోదరుడిగా, తమ్ముడిగా-నాకు శాశ్వత స్థానాన్ని ఇచ్చి, అమ్మలాంటి ఆప్యాయతతో నన్ను ఆదరించారని విజయ్ ఈ సందర్భంగా తెలిపారు. తమకు సర్వస్వం ప్రసాదించిన తమిళనాడు ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమిళ సమాజానికి కృతజ్ఞతలు ఎలా తీర్చుకోవాలనే దానిపై ఆలోచించి, దానికి ప్రతీకగా 2024లో 'తమిళనాడు విక్టరీ పార్టీ' (ఎఖ)ని ప్రారంభించామన్నారు.లౌకిక సామాజిక న్యాయం అనే విధానంతో రాజకీయ రంగంలోకి అడుగుపెట్టి కేవలం 27 నెలలో అయ్యిం దని, అయినప్పటికీ, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో నిరూపి తమైనట్లుగా, తమిళనాడు రాజకీయ చరిత్రలో మునుపెన్నడూ లేని అద్భుతాన్ని తాము సాధించామన్నారు. 35% ఓట్లతో, మీరు టీవీకేని అతిపెద్ద పార్టీగా నిలబెట్టారన్నారు. మీ తీర్పును గౌరవిస్తూ, ప్రజాస్వామ్య శక్తుల మద్దతుతో, మీ సేవకుడిగా మరియు తమిళనాడు ప్రజల ముఖ్యమంత్రిగా, అవినీతి రహిత, నిజాయితీతో కూడిన పరిపాలనను అందించాలనే ఆశయానికి కట్టుబడి ఉన్నానని విజయ్ తెలిపారు.

## పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం



హైదారాబాద్: పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహరరెడ్డి, రాజ గోపాల్‌రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితర సభ్యుల ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి దూరంగా 30--40 కిలోమీటర్ల అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎకరం రూ.150--200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో కూడా పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి తెలిపారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు డ్రాలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని సభ సాక్షిగా స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా అందించిన ఉదాహరణ లేదని, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రూ.5 లక్షలు సరిపోవడం లేదని పలువురు సభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు. మొదటి విడతలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయని మంత్రి వివరించారు. రెండు విడతల్లోనే సుమారు 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మొదటి విడతలో ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు ప్రారంభించి, నిర్మాణంలో చిన్నచిన్న లోపాల కారణంగా నిలిచిపోయిన సుమారు 3,200 ఇళ్లను రాటిఫై చేసి క్లియర్ చేశామని మంత్రి తెలిపారు. వారందరికీ ఈ వారం చివర్లోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.ం

# కొండల్ రెడ్డికి అక్రమకేటాయింపులు




హైదారాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. టెస్సరాక్ట్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన భూములను పరిశీలించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం క్షేత్రస్థాయికి చేరుకుంది. కొండల్ రెడ్డికి అనుకూలంగా ప్రభుత్వం ఈ భూములను కట్టబెట్టిందని ప్రధానంగా ఆరోపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, వివాదాస్పద భూములను స్వయంగా పరిశీలించేందుకు తుక్కుగూడ పరిసర ప్రాంతాలకు భారీ కాన్వాయ్‌తో చేరుకోవడంతో ఒక్కసారిగా అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ పరిశీలన పర్యటనలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. చేతుల్లో ప్లకార్డులు, భారీ బ్యానర్లు పట్టుకుని నేతలు ఆందోళన నిర్వహించారు. ప్రజాధనంతో ముడిపడి ఉన్న విలువైన ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై వారు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ సంఘటనా స్థలంలో నిరసన చేపట్టారు. ఈ భూముల అంశం అసెంబ్లీలోనూ తీవ్ర గందరగోళానికి దారితీసింది. సభలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నంలో భాగంగా పోడియం వద్దకు దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను ఖండిస్తూ పోడియం వద్ద పేపర్లు చింపి పైకి ఎగురవేయడంతో సభలో గందరగోళం తలెత్తింది. సభ్యుల ఆందోళన అదుపు తప్పడంతో స్పీకర్/చైర్మన్ జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడేందుకు మార్షల్స్‌ను రంగంలోకి దించాలని ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీలో నిరసనల అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన కోసం కేటీఆర్, హరీశ్ రావు నేతృత్వంలోని ఎమ్మెల్యేలు తుక్కుగూడలోని టెస్సరాక్ట్ సైట్‌కు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న భూకేటాయింపులపై పూర్తిస్థాయి వాస్తవాలను ప్రజల ముందుకు తెస్తామని, ఈ అంశంపై న్యాయపరమైన, ప్రజా పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. నాయకుల రాకతో స్థానిక పరిసరాల్లో భారీగా మోహరించిన పోలీసులు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. పర్యవేక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరైనా కేవలం లక్ష రూపాయలతో స్టార్టప్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వందల కోట్ల విలువైన భూములు ఇస్తుందా..? అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడుతోందని ఆరోపించారు. నెలకు రూ.4,000 పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లి సమీపంలోనే రైతులు కరెంట్ కోసం రోడ్డెక్కడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమనిమాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి సమీపంలోని శ్రీశైలం--హైదరాబాద్ జాతీయ రహదారిపై రైతులు మెరుపు ధర్నాకు దిగడం, ట్రాక్టర్లతో రాస్తారోకో చేయడం ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతూ రేవంత్ రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. పంటలు ఎండిపోతుంటే రైతులు రోడ్డెక్కారు.. కానీ ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టింపు లేకపోవడం దుర్మార్గమని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు 24 గంటల కరెంట్ హామీ ఇచ్చి, ఇప్పుడు రైతులకు 6--8 గంటల విద్యుత్ కూడా సరఫరా చేయకపోవడం శోచనీయమని అన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం, వారి గోడును పట్టించుకోకుండా చోద్యం చూడడం విడ్డూరమని తెలిపారు. ముఖ్యమంత్రి సొంత గ్రామానికి కూతవేటు దూరంలోనే రైతులు కరెంట్ కోసం జాతీయ రహదారిపైకి రావాల్సి పరిస్థితిని వస్తే దాన్ని 'ప్రజా పాలన' అంటారా? అని నిలదీశారు. సొంత ఇలాకాలోని రైతుల సమస్యలే పరిష్కరించలేని సీఎం , తెలంగాణలోని లక్షలాది మంది రైతుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారు? ఇదేనా కాంగ్రెస్ తెచ్చిన 'మార్పు' . రైతుల ఆక్రందన రేవంత్ రెడ్డికి వినిపించడం లేదా ? ఇప్పటికైనా రేవంత్ రెడ్డి మొద్దునిద్ర వీడి రైతుల పొలాలకు 24 గంటల కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## కూరగాయల సాగు విస్తీర్ణం పెంపునకు కృషి



హైదారాబాద్: తెలంగాణలో తగ్గుతున్న కూరగాయల సాగు విస్తీర్ణాన్ని తిరిగి పెంచడంతో పాటు రైతులకు ఆధునిక సాంకేతికత, నాణ్యమైన ఇన్‌పుట్స్, సాగునీటి సదుపాయాలు, శిక్షణ, ప్రాసెసింగ్, కోల్డ్‌స్టోరేజ్, మార్కెటింగ్ వంటి అన్ని రంగాలను సమన్వయం చేసి సమగ్ర వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ రోజు శాసనసభలో తెలంగాణ రాష్ట్రంలో కూరగాయల సాగుపై కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాయల్ శంకర్, యశశ్వినీ రెడ్డి, తదితర సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు.

గతంలో తెలంగాణలో సుమారు 3 లక్షల ఎకరాల్లో కూరగాయల సాగు జరిగితే, ప్రస్తుతం అది సుమారు లక్ష ఎకరాలకు తగ్గిపోయిందని మంత్రి తెలిపారు. ఫలితంగా 2025-26 సంవత్సరంలో ప్రభుత్వ లెక్కల ప్రకారం సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల వివిధ రకాల కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చిందని వివరించారు. ఈ వానాకాలంలో 51000 సాధారణ విస్తీర్ణానికి గాను 72,583 ఎకరాలలో కూరగాయల సాగు జరిగిందని తెలిపారు. కూరగాయల ధరలు ప్రధానంగా డిమాండ్, సరఫరాపై ఆధారపడి ఉండటం వల్ల మార్కెట్లో ధరల్లో తరచూ హెచ్చుతగ్గులు ఉంటాయని పేర్కొన్నారు. రైతులకు లాభదాయకమైన పంటల వైపు వెళ్లేలా ప్రోత్సహించడంతో పాటు, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు.

కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు నారు, మల్చింగ్, షేడ్‌నెట్, శాశ్వత పందిళ్లు, బిందు మరియు తుంపర సేద్యం వంటి సదుపాయాలను రైతులకు రాయితీలపై అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కూరగాయల నారు, మల్చింగ్, షేడ్‌నెట్ కోసం రూ.20 కోట్లు, శాశ్వత పందిళ్ల కోసం రూ.8 కోట్లు, బిందు సేద్యం కోసం రూ.97 కోట్లుకేటాయించినట్లు వెల్లడించారు. అన్ని పంటలకు విస్తీర్ణం ఆధారంగానే రైతు భరోసా అందిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

రాష్ట్రంలో కూరగాయల సాగు విస్తీర్ణాన్ని తక్షణమే పెంచేందుకు ప్రస్తుత వానాకాలంలో సుమారు లక్ష ఎకరాల్లో, తదుపరి రబీ సీజన్‌లో మరో లక్ష ఎకరాల్లో కూరగాయల సాగుకు ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి తెలిపారు.

తెలంగాణకు అవసరమైన కూరగాయలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకునే పరిస్థితి లేకుండా చేసి, తెలంగాణలో పండించిన కూరగాయలు ఇతర రాష్ట్రాలకు వెళ్లే స్థాయికి ఉత్పత్తిని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ మేరకు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. రైతులు అధిక దిగుబడి, మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల వైపు వెళ్లేలా వ్యవసాయ విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. కొన్ని పంటలు, కొన్ని పద్ధతులకే రాయితీలు పరిమితం కావడం వల్ల వ్యవసాయంలో సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందన్నారు.

రైతులకు అవసరమైన పంటలు, భూమి సంరక్షణ, సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించే విధంగా రాయితీల విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రకృతి సేద్యాన్ని కూడా పెంచి పోషించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకొని రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. యూరియా వినియోగం పెరగడం వల్ల పురుగు మందుల

# ప్రతిపక్షం కుట్రను బలంగా తిప్పికొట్టాం



ప్రజాప్రతినిధి హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్‌లో రాజకీయంగా రాణించలేరు. అందరికీ వెసులుబాటుగా ఉండాలని అత్యంత చారిత్రక భవనంలో శాసన మండలి నిర్వహిస్తున్నాం. అసెంబ్లీలో సెంట్రల్ హాల్‌ను ప్రారంభించుకుని దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టుకున్నాం. సభలో ఎవరి నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు వారు ప్రస్తావించాలి. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే ఇప్పుడు భారాసలో ఉన్న సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? పోలీస్ సిబ్బందిలో కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి కనిపించారనుకుంట. ఎంతో ఆక్రోశంతో అధికారులపై దాడులు చేశారు" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

ఇదే పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి: భట్టికలిసి పనిచేస్తే ప్రతిపక్షాల కుట్రలను ఛేదించవచ్చని నిరూపితమైందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. "భారాస నాయకుల తీరు, వారి భాష, శు ద్ధీకరణపై సభ్యులందరం గట్టిగా మాట్లాడి కట్టడి చేయగలిగాం. మనమంతా ఒకటే మాట, ఒకటే బాటగా ఇదే పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేయలేదు. మనం ప్రచారం చేసుకోవాలి. సరైన విధంగా ప్రచారం చేసుకుంటే ఆ ప్రవాహంలో ప్రతిపక్షాలు కొట్టుకుపోతాయి. సంక్షేమం, విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం చేపట్టిన చర్యలను ఇంటింటికీ తెలియజేయాలి. చేసిన పనులే మనల్ని గెలిపిస్తాయి. ప్రచార కార్యక్రమాన్ని పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు తీసుకునివెళ్లాలి" అని సూచించారు.

దుర్మార్గంగా సర్ ప్రక్రియ: మహేశ్‌కుమార్‌గౌడ్

దేశంలో సర్ ప్రక్రియ దుర్మార్గంగా సాగుతోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. పకడ్బందీగా దళితులు, గిరిజనుల ఓట్లను ఎక్కువగా తొలగిస్తున్నారు. రాష్ట్రంలో అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవు. సామాజిక న్యాయం తెలంగాణ లోనే అమలవుతోంది. బీసీ బిడ్డ కాకపోయినా సీఎం రేవంత్‌రెడ్డి బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ముందుకు వచ్చారు. కానీ కేంద్రం సహకరించ లేదు. వచ్చే రెండున్నర సంవత్సరాలు కీలకం" అని అన్నారు. పాలిటెక్నిక్‌లను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తేవడం వల్ల అక్కడి విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగదని మంత్రి వివేక్ వాస్తవాలను వివరించారు.

# 8,283 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



హైదారాబాద్: 2026-27 వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 2026-27 వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, సుమారు 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు సీఎస్ తెలిపారు. ఇందులో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. 2026-27 వానాకాల ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ సంజయ్ జాజు గురువారం డా. బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. గత వానాకాలం సీజన్‌లో సుమారు 70 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి, 154.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సీఎస్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,283 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఇతర కొనుగోలు ఏజెన్సీల సమన్వయంతో కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమవుతుందని, నవంబర్‌లో పెద్దఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం రవాణా, హమాలీల ఏర్పాటు, గోదాములు, నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించాలని సీఎస్ సూచించారు. రైతుల ఆధార్ వివరాలను చెల్లింపుల కోసం ఉపయోగించే బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసే ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వ, చెల్లింపుల ప్రక్రియలో ఎక్కడా జాప్యం లేకుండా శాఖల మధ్య సమన్వయం ఉండాలని, రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డీ.ఎస్. చౌహాన్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

**మెట్రోతో మరో 50 బస్సులు అనుసంధానిస్తాం**

**పీఎం ఈడ్రైవ్ కింద నగరానికి 2,200 బస్సులు**

**తెలంగాణలో కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం**

**రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

హైదారాబాద్: గత ప్రభుత్వం హయాంలో ఆర్టీసీ మూసివేసే పరిస్థితి ఉండగా ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం సమాధానాలిచ్చారు. పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు రాబోతున్నాయని తెలిపారు. ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికల)కు గత ప్రభుత్వం రద్దు చేసిందన్న మంత్రి, త్వరలో ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్ నగరానికి 100 మినీ బస్సులు రాబోతున్నాయి. వాటిలో 50 పాతబస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తాం. 347.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం పొందగలిగారు. ఇది ఒక చరిత్ర అని తెలిపారు. ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత కొత్త బస్టాండ్లు నిర్మిస్తాం. వంద మినీ బస్సులు రాబోతున్నాయి. పాతబస్తీకి 50 కేటాయిస్తాం. మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానం చేస్తాం. బస్టాండ్ల అభివృద్ధికి ఆర్థికంగా ఎమ్మెల్యేలు సహకరించాలి.

# మద్యం కుంభకోణం తీవ్ర ఆర్థిక నేరం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలకు సర్వోన్నత న్యాయస్థానంలో తీవ్ర విఘాతం ఎదురైంది. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని వారు దాఖలు చేసిన పిటిషన్లను భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నాయకత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది. ఈ సందర్భంగా కేసు తీవ్రతను ప్రస్తావించిన సీజేఐ... ఇది తీవ్రమైన ఆర్థిక నేరమని వ్యాఖ్యానించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నమోదు చేసిన ఆర్థిక అక్రమాల కేసుతో

పాటు రాష్ట్ర పోలీసుల ప్రత్యేక విచారణ బృందాల (సిట్, సీఐడీ) దర్యాప్తు ఒకే సమయంలో సమాంతరంగా సాగడంలో తప్పులేదని కోర్టు తేల్చిచెప్పింది. నిందితులు ఇప్పటికే ఈడీ కస్టడీలో ఉన్నారని న్యాయవాదులు తెలుపగా... ఈడీ కస్టడీ పూర్తయిన తక్షణమే సిట్ కస్టడీకి అప్పగించేలా ప్రొడక్షన్ వారెంట్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చిన ధర్మాసనం... సిట్ విచారణ ప్రక్రియ ముగిసిన అనంతరం నిందితులు సంబంధిత కింది కోర్టులోనే రెగ్యులర్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

భారత్ ప్రతినిధి
తెలుగు దిన పత్రిక

గుంటూరు వార్తలు
శుక్రవారం, 11 సెప్టెంబర్ 2026



# ఇష్టానుసారంగా గోడలపై పోస్టర్లు అంటిస్తే కఠిన చర్యలు

## నగర కమిషనర్ కె.మయూర్ అశోక్



**గుంటూరు, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరంలో రహదారుల డివైడర్లు మరియు ప్రభుత్వ కార్యాలయాల గోడలపై ఇష్టానుసారం పోస్టర్లు అంటించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ కొత్తపేట, బస్టాండ్ రోడ్, నందివెలుగు రోడ్, షాప్ ఎంప్లాయీస్ కాలనీ, జామియా నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఇప్పటికే ప్రింటర్స్, వివిధ మత సంస్థల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి డివైడర్లు, ప్రభుత్వ కార్యాలయాల గోడలపై ఇష్టానుసారం పోస్టర్లు అంటించవద్దని తెలియచేసినప్పటికీ, కొందరు మరలా అంటిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇకపై నిబంధనలు ఉల్లంఘించే వారిపై భారీ అపరాధ రుసుం విధించడంతో పాటు, పట్టణాన్ని "పోస్టర్ ఫ్రీ సిటీ"గా ఉంచేందుకు పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెంట్రల్ డివైడర్లలో ఎటువంటి ఫ్లెక్సీలు ఉండటానికి వీల్లేదని, ప్లానింగ్ కార్యదర్శులు వీటిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలనలో భాగంగా వర్కర్స్ హాజరు వంద శాతం పక్కాగా ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్) ద్వారానే ఉండాలని, డ్రైన్లను నిరంతరం శుభ్రం చేస్తూ నగరంలో ఎక్కడా గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రధాన రహదారులపై సెకండరీ కలెక్షన్ పాయింట్లు ఉండకూడదని, వాటిని వెంటనే అక్కడి నుండి వేరే ప్రాంతాలకు షిఫ్ట్ చేయాలని స్పష్టం చేశారు. కొత్తపేట సంతోష్ హోండా రోడ్డు పరిశీలన సందర్భంగా రోడ్డుపైనే నిర్మాణ సామాగ్రి నిల్వ ఉంచడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేసి, అనేక మార్లు హెచ్చరించినప్పటికీ రోడ్లపై మెటీరియల్ పెట్టి ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తున్ననిర్మాణదారులకు వర్క్ స్టాప్ ఆర్డర్ ఇవ్వాలని, ఈ విషయంలో అలసత్వం వహించిన పట్టణ ప్రణాళిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర పరిధిలోని రోడ్లపై ఉన్న పాట్ హోల్స్ గుంతలను తక్షణమే రిపేర్ చేయాలని, చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి సచివాలయం పరిధిలో తాగునీటి సరఫరా సమయంలో శ్యాంపిల్స్ తీసి, వాటర్ క్వాలిటీ డేటాను సిపిఎం యాప్‌లో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో ఎస్ఈ సుందరరామిరెడ్డి, డిఈఈ చైతన్య, ఎస్ఎస్ సాంబయ్య, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఒకరికి రెండు ఓట్లు ఉండడానికి వీలులేదు



మాజీ మంత్రి అంబటి రాంబాబు

**గుంటూరు, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ప్రజా స్వామ్యంలో ఒకరికి ఒక ఓటు మాత్రమే ఉండాలని, రెండు ఓట్లు ఉండే అవకాశం ఉండకూడదని మాజీమంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఇదే అంశంపై గురువారం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అదేవిధంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో అంబటి రాంబాబు మాట్లాడుతూ గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గంలో అనేక డబల్ ఓట్లు ఉన్నాయన్నారు. (సర్) ప్రక్రియ ద్వారా డబల్ ఓట్ల ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒక మనిషికి రెండు ఓట్లు ఉండడం ప్రజా స్వామ్యానికి మంచిదికాదన్నారు. డబల్ ఓట్లు ఉన్నాయి అని తెలిసిన స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావడం చాలా ఆశ్చర్యంగా ఉందన్నారు.

# 'గ్రీన్ గణేష్' మట్టి విగ్రహాల తయారీ "వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్" నమోదు విజయవంతం చేయండి

## నగర కమిషనర్ కె.మయూర్ అశోక్



**గుంటూరు, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11న చేపట్టనున్న గ్రీన్ గణేష్ మట్టి విగ్రహాల తయారీ కార్యక్రమాన్ని "వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్" నందు నమోదు చేయనున్నదని, రికార్డ్ నమోదు విజయవంతం అయ్యేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. గురువారం గ్రీన్ గణేష్ కార్యక్రమంలో భాగంగా ఏకకాలంలో 25 వేలమంది విద్యార్థులతో మట్టి గణేష్ విగ్రహల తయారీ కార్యక్రమ ఏర్పాట్లను నగర పాలక సంస్థ యన్టిఆర్ స్టేడియంలో సెంట్రలైజ్డ్ గా ఏర్పాటు చేస్తున్నసభాప్రాంగణాన్ని అధికారులతో కలిసి పరిశీలించి తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, విద్యార్ధులకు పర్యావరణం పై అవగాహన పెంచడంతో పాటు వరల్డ్ బుక్ రికార్డ్స్ లో గుంటూరు పేరు నిలిచేలా గ్రీన్ గణేష్ కార్యక్రమం జరుగుతుందన్నారు. నగరంలోని 52 పాఠశాలల్లోని 25 వేల మంది విధ్యార్ధులతో మట్టి గణపతి విగ్రహాలు తయారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, సదరు కార్యక్రమాన్ని సెంట్రలైజ్డ్ గా ఎన్టిఆర్ స్టేడియంలో పర్యవేక్షింస్తామన్నారు. ఇప్పటికే విగ్రహాల తయారీకి అవ సరమైన విత్తనాలు కలిపిన మట్టి, విద్యార్ధులకు రిస్ట్ బ్యాండులు, ప్రశంసా పత్రాలను అన్ని పాఠశాలలకు అందజేయుట జరిగిందన్నారు. కార్యక్రమం జరిగే ప్రతి పాఠశాలకు విధులకు కేటాయించబడిన సిబ్బంది, కార్యదర్శులు నిర్దేశిత సమయంలో కార్యక్రమం జరిగేలా సమన్వయం చేసుకోవాలన్నారు. స్టేడియంలో జరిగే కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్ధులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా, అవసరమైనా సదుపాయాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణ సామగ్రి అన్ని పాఠశాలలకు అందటం, విద్యార్ధులు భాగస్వాములు అవటం పై ఎంఈఓ లు, పాఠశాలల యాజమాన్యాలతో మరియు నగర పాలక సంస్థ అధికారులతో సమన్వయంతో చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జి.సాంబశివరావు, ఎంటిఆర్ స్టేడియం సెక్రటరీ వజ్జా రామక్రిష్ణ, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, సిహెచ్. శ్రీనివాస్, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎంహెచ్ఓ డాక్టర్ సురేష్ బాబు, ఎస్ఈ సుందరరామిరెడ్డి, సిటి ప్లానర్ రాంబాబు, ఉపా సెల్ పిఓ సింహాచలం, ఎంఈఓలు ఖుద్దూస్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు జిల్లాలో బీఎస్సీ ఎంఎల్ టీ ఉ ఏఎహెచ్ ఎస్ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని, గత జగన్ ప్రభుత్వంలో వైఫల్యాలు కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక తూర్పు కార్యాల యంలో విద్యార్థులు ఎమ్మెల్యే నసీర్ని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసు కువెళ్లాలన్నారు. ?నాలుగేళ్లలో పూర్తి కావాల్సిన బీఎస్సీ ఎంఎల్ టీఉ ఎలైడ్ హెల్త్ సైన్సు కోర్సులు అనేక కారణాల వల్ల ఆరు సంవ త్సరాలకు పొడిగించారని, పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదలలో తీవ్ర జాప్యంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నామని వివరించారు. విద్యార్థుల భవిష్యత్తుతో సంబంధిత విశ్వవిద్యాలయాలు, కళాశాల యాజమాన్యాలు చెలగాటమాడుతున్నాయని తెలి పారు. కోర్సులను సకాలంలో పూర్తి చేయాల్సిన విద్యార్థులు సంవత్సరాల తరబడి అకడమిక్ ప్రక్రియ పూర్తికాక ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ?ఇంటర్న్‌షిప్ సమయంలో విద్యార్థులు ఆసుపత్రులు, ల్యాబొరేటరీలు మరియు ఇతర ఆరోగ్య సేవా విభాగాల్లో సేవలందిస్తున్నప్పటికీ వారికి ఎలాంటి తగిన ఆర్థిక భద్రత లేదన్నారు వెంటనే నెలకు రూ.15 వేలు స్టైపెండ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. 2021 బ్యాచ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ కాలానికి సంబంధించిన తగిన స్టైపెండ్ చెల్లించాలన్నారు. అన్ని కోర్సులకు స్పష్టమైన అకడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించాలన్నారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే నసీర్ హామీ ఇచ్చారు.

# చిట్యాల ఐలమ్మ ధైర్యం తెగువ భావితరాలకు స్ఫూర్తి



ఎమ్మెల్యే గళ్ళా మాధవి
వీరవనిత చిట్యాల ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



**గుంటూరు, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** చిట్యాల ఐలమ్మ ధైర్యం, తెగువ భావితరాలకు స్ఫూర్తి" అని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. గురువారం వీరవనిత చిట్యాల ఐలమ్మ (చాకలి ఐలమ్మ) 41వ వర్ధంతి సందర్భంగా గుంటూరు రింగ్ రోడ్ చంద్రమౌళినగర్ లోని ఆమె విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ఉ టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా నివాళులర్పించారు.

**ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ** చిట్యాల ఐలమ్మ కేవలం ఒక సామాజిక వర్గానికే కాదు, యావత్ సమాజానికి స్ఫూర్తిగా నిలిచిన మహోన్నత మహిళ అని కొనియాడారు. ఒక జాతికి గుర్తింపు, గౌరవం తీసుకురావాలంటే కొందరి త్యాగాలు, పోరాటాలు కారణమవుతాయని, అలాంటి త్యాగమూర్తుల్లో చిట్యాల ఐలమ్మ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. సామాజిక వివక్ష, అన్యాయాలకు ఎదురొడ్డి పోరాడిన ధైర్యసాహసాలు నేటికీ ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఎవరికి భయపడకుండా పోరాడిన సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ అని, "నా భూమి – నా హక్కు" అనే సంకల్పంతో అన్యాయాన్ని ఎదిరించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారని ఎమ్మెల్యే తెలిపారు. మహిళ అయినప్పటికీ ఆమె చూపిన తెగువ, నిజాన్ని నిర్భయంగా నిలదీసే తత్వం, పోరాట పటిమ నేటి యువతకు మార్గదర్శకమని అన్నారు. ఇలాంటి మహనీయులను కేవలం ఒక వర్గానికి పరిమితం చేయకుండా సమాజానికి అంకితం చేయాల్సిన అవసరం ఉందని, భావితరాలు వారి జీవితాల నుంచి స్ఫూర్తి పొందేలా చేయాలని గళ్ళా మాధవి సూచించారు. నేటి యువత చిన్న చిన్న సమస్యలకు నిరాశకు గురికాకుండా చిట్యాల ఐలమ్మలాంటి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలో అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన చిట్యాల ఐలమ్మ సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్లు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, కుల సంఘాల నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అర్హులెవరూ పెన్షన్‌కు దూరం కాకూడదు : ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్లకు అర్హులైన వారందరూ ఈ నెల 16వ తేదీలోపు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. గురువారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ లో అర్జీలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మీడియాతో మాట్లాడారు. అక్టోబర్ 1 నుంచి కొత్త పెన్షన్లు మంజూరు చేయనున్న నేపథ్యంలో అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అద్దె ఇళ్లలో నివసించే వారికి ఇంటి పన్ను రసీదు సమర్పణపై ఇబ్బందులు ఉన్నాయని ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, ఈ నిబంధనలో సడలింపు కల్పించేలా చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గత ఏడాది కాలంలో తన కార్యాలయానికి కొత్త పెన్షన్ల కోసం 222 దరఖాస్తులు వచ్చాయని, వారికి ఇప్పటికే సమాచారం అందించి దరఖాస్తు చేసుకోవాలని సూచించినట్లు చెప్పారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, మత్స్యకారులు తదితర అర్హులైన వర్గాల వారు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు.

# పీఠాధిపతి చిన్నాబత్తిని భాగ్యయ్య దశమ పీఠాధిపత్య వేడుకలు



**గుంటూరు, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరులోని డాన్ బాస్కో ప్రాంగణంలో మహోఘన శ్రీశ్రీశ్రీ డాక్టర్ చిన్నబత్తిని భాగ్యయ్య పీఠాధిపతుల దశమ పీఠాధిపత్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పీఠాధిపతులు మాట్లాడుతూ తమ ఆధ్వర్యంలోని 107 విచారణల కార్యకలాపాలకు ఇప్పటివరకు తానే బాధ్యత వహిస్తున్నట్లు తెలిపారు. ఆధ్యాత్మిక అభివృద్ధితో పాటు ఆర్థిక అభివృద్ధి, పిల్లలకు విద్యా సదుపాయాల కల్పన, పలు సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మరింత మెరుగ్గా సేవలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ దశమ పీఠాధిపత్య వేడుకలకు మహోన్నత కార్డినల్, పీఠాధిపతులు, పూజ్య గురువులు, బ్రదర్స్, కన్యాస్త్రీలతో పాటు సుమారు 5 వేల నుంచి 10 వేల మంది భక్తులు పాల్గొననున్నట్లు తెలిపారు.

# కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగుల హక్కుల కోసం రణభేరి

## పారామెడికల్ అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు వి. రమేష్ బాబు



**గుంటూరు, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పారామెడికల్ అవుట్సోర్సింగ్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు వి. రమేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద సెప్టెంబర్ 13న గుంటూరు బ్రాడిపేట లోని సిపిఎం కార్యాలయం, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం లో జరిగే 'రణభేరి ఇక సమరమే' పోస్టర్ ను ఆవిష్కరించారు. రమేష్ బాబు మాట్లాడుతూ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. 12 వేలుగా ఉన్న తమ వేతనం గత వైసిపి ప్రభు త్వం మూడు వేలు పెంచి, 15 వేలు ఇవ్వడం జరిగిందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిన హామీని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.

## పెళ్ళికి అడ్డుపడుతుందన్న అనుమానంతో దారుణ హత్య

పెద్దకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన
ముగ్గురు నిందితులని అరెస్ట్ చేసిన పోలీసులు
హత్య యొక్క వివరాలను వెల్లడించిన నార్త్ డీఎస్పీ మురళి కృష్ణ




**గుంటూరు/పెద్దకాకాని, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** పెద్దకాకాని పోలీస్ స్టేషన్ పరిధి లో సెప్టెంబర్ 7వ తేదీ నాడు వేనుగండ్ల గ్రామంలో మహిళ హత్యకు గురైనట్లుగా సమాచారం అందింది. సమాచారం అందుకున్న పెద్దకాకాని పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతురాలు కోటేశ్వ రమ్మ 47 గా గుర్తించారు. మృతురాలు కుమారుడు సాదిక్ కి నిందితురాలు మరియా కుమారి కూతురుకి వివాహం చేయా లని భావించింది. సాదిక్ తల్లి వివాహానికి అడ్డుపడుతుందన్న అనుమానంతో యద్దనపూడి మరియాకుమారి,బత్తుల మహేష్, అన్నంగి శ్రీకాంత్, కలసి కోటేశ్వరమ్మను హతమార్చారు. హత్య అనంతరం 1లక్ష నగదును, జత బంగారు గాజులు, నాలుగు బంగారు ఉంగరాలు, ఒక జత బంగారు చెవి పోగులు, ఒక బంగారు నల్లపూసల దండ, నిందితులు చోరీ చేశారు. ఈ హత్య పక్కా ప్లాన్ ప్రకారం కోటేశ్వరమ్మను అడ్డు తొలగిం చుకోవాలని ఆమె గొంత కోసి ముగ్గురు నిందితులు హత్య చేశారు.

## నేడు ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో 'ఆలాపన'

**గుంటూరు, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కళాతపస్వి డాక్టర్ గరికపాటి రాజారావు 63వ వర్ధంతిని పురస్కరించుకొని ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు గుంటూరు, బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో అభ్యుదయ దేశభక్తి గేయాలతో 'ఆలాపన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.పద్మ, ఆర్.వి. రాఘవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ కళకోసం కాదు ప్రజల కోసం అనే నినాదంతో సమాజంలో ఉన్న రుగ్మతలను పోగొట్టాలంటగే కళను ఆయుధంగా మలిచి ప్రజల్ని చైతన్యం చేయటానికి డాక్టర్ రాజారావు కృషి చేశారన్నారు. రాజారావు స్ఫూర్తితో ప్రత్యామ్నాయ సాంస్కృతిక ఉద్యమ నిర్మాణానికి ప్రజానాట్యమండలి కృషి చేస్తుందని చెప్పారు. ఆలాపన కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర గాయకులు పాల్గొని గేయాలు ఆలపిస్తారని, కావున కళాకారులు, కళాపోషకులు, కళాభిమానులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## డీఎస్సీపై వైసిపి అసత్య ఆరోపణలు కుట్రలు మానుకోవాలి



జాతీయ బీసీ బహుజన ఫ్రంట్ అధ్యక్షులు తాటికొండ నరసింహారావు

**గుంటూరు, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 16 వేల మంది పైగా నిరుద్యోగులు కష్టపడి చదివి పారదర్శకంగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయులుగా ఎంపిక కాబడితే వారి జీవితాల్లో వైసిపి పార్టీ వారు అసత్య ఆరోపణలు కుట్రలు కుతంత్రాలు చేసి అడ్డుకోవాలని చూడటం సరైన విధానం కాదని అత్యంత దుర్మార్గం అని జాతీయ బిసి బహు జన ఫ్రంట్ అధ్యక్షులు తాటికొండ నరసింహారావు పేర్కొన్నారు. ఈ సమాజానికి విద్యార్థిని విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉన్న ఉపాధ్యాయులపై ఒక తప్పుడు అభియోగం మోపి డీఎస్సీ ప్రక్రియను పద్నాం చేయటమే పనిగా పెట్టుకుంటే చరిత్ర క్షమించదని నరసింహారావు హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వం హయాంలో ఐదు సంవత్సరాలు లో ఒక డీఎస్సీ కూడా ఇవ్వకపోగా జాబు కాలండర్ సైతం విడుదల చేయకుండా నిరుద్యోగుల పట్ల వివక్షత చూపిన విషయం నిరుద్యోగులు మర్చిపోలేదని గుర్తు చేశారు. పారదర్శకంగా కూటమి ప్రభుత్వం విద్యాశాఖ మంత్రి లోకేష్ మొదట డిఎస్సీ ఇచ్చి రెండో డీఎస్సీకి సంసిద్ధమవుతుంటే ఓర్వలేక ఇప్పుడు డీఎస్సీ పై అబాండాలు వేయటం మానుకోవాలని హితవు పలికారు పారదర్శకంగా ఉద్యోగాలు సాధించిన యువతిపై అవాకులు చవాకులు పేల్చటం సరైనది కాదని నరసింహారావు అన్నారు. మెరిట్ ఆధారంగా పారదర్శకంగా ఎంపికైన ఉపాధ్యాయులను విధి నిర్వహణలో ఉండగానే క్లాస్ రూములోకి చొచ్చుకుపోయి విద్యార్థులు ముందే బెదిరించటం, విద్య బుద్ధులునేర్పే పవిత్ర దేవాలయం లాంటి బడుల్లోకి చొరబడి గురువులను భయాందోళనకు గురి చేస్తూ అవమానించటం వలన సభ్య సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సి వస్తుందని అన్నారు.

# నాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర





**విజయవాడ, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని పలు నిమజ్జన ప్రాంతాల్లో ఆయన క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. ఎంజీ రోడ్ పోలీస్ కంట్రోల్ రూమ్, తుమ్మలపల్లి కళాక్షేత్రం రోడ్, వినాయక టెంపుల్ రోడ్, సీతమ్మవారి పాదాలు, భవానీపురం హెడ్ వాటర్ వర్క్స్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, హెచ్‌బీ కాలనీ, విద్యాధరపురం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. సీతమ్మవారి పాదాల వద్ద నిమ జ్జనానికి అవసరమైన వాహనాలు, క్రేన్లు, లైటింగ్, పారిశుద్ధ్య సిబ్బంది, ఇతర మౌలిక వసతులను సిద్ధంగా ఉంచాలని సూచిం చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, నిమజ్జనం అనంతరం పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వినాయక చవితి వేడుకలను పర్యావరణహితంగా నిర్వహించాలని కమిషనర్ కోరారు. మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం హెచ్‌బీ క్యాంటీన్‌లోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన కమిషనర్.. అక్కడ పారిశుద్ధ్యం, ఆహార నాణ్యత, ప్రజలకు అందుతున్న సేవలను తనిఖీ చేశారు. ప్రజలకు పరిశు భ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో జోనల్ కమిషనర్ ఎన్. శ్రీనివాస్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ స్థాయిలో బాపట్ల మున్సిపల్ హైస్కూల్ !

ఎమ్మెల్యే నరేంద్ర వర్మ వినతి



**బాపట్ల, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** చరిత్ర కలిగిన బాపట్ల పురపాలక సంఘ ఉన్నత పాఠశాల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఒక నిర్మాణాత్మకమైన కృషి జరుగుతోంది. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా దీన్ని తీర్చిదిద్దాలని ఒక అద్భుతమైన సంకల్పానికి బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు శ్రీకారం చుట్టారు. అత్యున్నతమైన విద్యా ప్రమాణాలతో పాటు, అత్యుత్తమ సదుపాయాలు కల్పించేలా కృషి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని నరేంద్ర వర్మ వెల్లడించారు. నియోజకవర్గ స్థాయి 'మోడల్ స్కూల్'గా ఈ పాఠశాలను తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా బాపట్లలోని ఈ పాఠశాలలో 2024 డిసెంబర్ 7వ తేదీన మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ పాల్గొన్న ఈ కార్యక్రమంలో విద్యా వ్యవస్థలో నూతన సంస్కరణలకు ఇక్కడి నుండే శ్రీకారం చుట్టారు. అదే ఒరవడిలో ఈ పాఠశాల అభివృద్ధికి నాటినుండి నేటి వరకు అడుగడుగున అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ తెలిపారు. మున్సిపల్ హైస్కూల్‌ను మోడల్ స్కూల్‌గా మార్చాలని, నియోజకవర్గం లోని పిట్టల వాని పాలెం మండలం కొత్తపాలెంలో నూతన ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని, అలాగే పట్టణంలో నూతన ప్రభుత్వ జూనియర్ కాలేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మంత్రి నారా లోకేష్ కు విజ్ఞప్తి చేశారు. గతంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ చేసిన వినతిపై సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ పాఠశాల ఆధునీకరణ కోసం రూ. 1.48 కోట్ల ప్రత్యేక నిధులను, పీఎం పోషణ్ కింద మరో రూ. 16 లక్షలను మంజూరు చేశారు. ఈ నిధులతో 24 అత్యాధునిక తరగతి గదులు, సువిశాలమైన డైనింగ్ హాల్, మోడరన్ కిచెన్, అధునాతన సైన్స్ ల్యాబ్‌లను నిర్మించారు.. తిరిగి తాజాగా మంత్రి లోకేష్ ను కలిసిన బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ఈ పాఠశాలను మోడల్ పాఠశాలగా తయారు చేయడంలో ప్రభుత్వ సహకారం అవసరమని తెలిపారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందించారు. అవసరమైన నిధులు కేటాయించేందుకు తగిన భరోసా ఇచ్చారు.బాపట్ల నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు, ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు నిరంతరం సహకారాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ కు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

# జంక్షన్ల అభివృద్ధి పనులకు చర్యలు తీసుకోవాలి

నగర కమిషనర్ కె.మయూర్ అశోక్



**గుంటూరు, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారులు, జంక్షన్ల అభివృద్ధి పనులకు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్లో ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ (ఏపియుఐఎయంయల్), నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో అభివృద్ధి పనుల పై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో రోడ్ల విస్తరణ పూర్తైన బృందావన్ గార్డెన్స్ రోడ్డు నిర్మాణ పనులు నిర్దేశిత ప్లాన్ ప్రకారం జరగాలన్నారు. అలాగే రోడ్డు కారిడార్ అభివృద్ధిలో భాగంగా గుర్తించిన రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశిత జంక్షన్లలో ఏపియుఐఎయంయల్, జియంసి పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులు సంయుక్తంగా ట్రాఫిక్ స్టడీ చేయాలన్నారు. తదుపరి సమావేశం నాటికి యాక్షన్ రిపోర్ట్ అధించాలని ఆదేశించారు. సమావేశంలో సిటీ ప్లానర్ రాంబాబు, జియంసి యస్.ఈ సుందర్రామి రెడ్డి, ఈ.ఈ విష్ణువర్ధన్, డి.ఈ.ఈ వెంకట రమణ, ఏపియుఐఎయంయల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు కొనసాగిద్దాం

సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి



**గుంటూరు, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) గుం టూరు నగర సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరి గింది. సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి పూలమాల వేసి ఘనం గా నివాళులర్పించారు.

**ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ తన జీవితాంతం పోరాడారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఐలమ్మ పోరాటం గొప్ప స్ఫూర్తిగా నిలిచిందని తెలిపారు. అప్పటి భూ స్వామ్య, జమీందారీ దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా తిరుగుబాటు జెండా ఎగురవేసిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. తనకు ఉన్న ఎనిమిది ఎకరాల భూమిలో పండించిన పంటను దోచుకు నేందుకు వచ్చిన భూస్వాముల అనుచరులను ఐలమ్మ ధైర్యంగా ఎదుర్కొన్నారని తెలిపారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం కారణంగా ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర నిర్బంధానికి గురైనప్పటికీ, ఏమాత్రం వెనక్కి తగ్గకుండా న్యాయ పోరాటం కూడా కొనసాగించి విజయం సాధించారని మాల్యాద్రి వివరించారు. అణగారిన వర్గాలు, పేదలు, మహిళలహక్కుల కోసం ఐలమ్మ చేసినపోరాటంచరిత్రలోచిరస్థాయిగానిలిచిపోయిం దన్నారు.

**సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ మాట్లాడుతూ** ఐలమ్మ జీవితం నేటి మహిళలకు ఎంతో స్ఫూరి దాయకమని అన్నారు. మహిళలు తలెత్తి మాట్లాడటానికి కూడా అవకాశం లేని రోజుల్లో భూస్వామ్య దోపిడీకి, వెట్టిచాకిరీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడారని తెలిపారు. తనపై, తన కుటుంబంపై ఎన్ని ఒత్తిళ్లు, నిర్బంధాలు వచ్చినా వెనుకడుగు వేయకుండా ప్రజల కోసం పోరాటం కొనసాగించిన ఐలమ్మ త్యాగా లు స్ఫూర్తిదాయకమన్నారు. నేటికీ పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి హక్కుల సాధన కోసం ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అరుణ్ కుమార్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మేడా హనుమంతరావు నగర కమిటీ సభ్యులు నూతలపాటి చిన్న,జి సురేష్ బాబు, పరిమళ బన్నీ, బి.వెంకటేశ్వర్ రెడ్డి, రావుల అంజిబాబు, ఆకిటి రామచంద్రుడు, జగన్నా థం, వేగయ్య,ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి శశి,అమర్, గణేష్ తదితరులు పాల్గొని ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు.

# నేడు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పదాధికారుల సమావేశం



**గుంటూరు, 10 సెప్టెంబర్ 2026, భారత్ ప్రతినిధి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ కి భారతీయ జనతా పార్టీ అందిస్తున్న సహకారాలు అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టే అనేకమైన సంక్షేమ పథకాలపై వివరణ ఇస్తూ బిజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్ గుంటూరు నగరంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు నగ రంలో అమరావతి రోడ్డులో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పదా ధికారుల సమావేశం గురించి మరియు ఈ కార్యక్రమానికి జాతీయ భారతీయ జనతా పార్టీ నాయకులు శివ ప్రకాష్ జి మరియు ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్ రాష్ట్ర మంత్రులు పార్లమెంటు సభ్యులు శాసనసభ్యులు ఎమ్మెల్సీలు చైర్మన్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ముఖ్య నేతలు అందరూ హాజరవుతున్నారని మీడియాకు దర్శనపు శ్రీనివాస్ తెలియజేశారు. అదేవిధంగా ఈనెల 17వ తేదీ నుండి వచ్చేనెల అక్టోబర్ 17వ తేదీ వరకు భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన పురస్కరించుకొని సేవా సంకల్ప అభియాన్ పేరుతోటి ఆయన 25 ఏళ్ల అధికార రాజకీయ జీవితాన్ని ఆయన చేసిన అనేకమైన మేలులు దేశ ప్రజలకు తెలియజేసే విధంగా కార్యక్రమాలని రూపొందించినట్లు శ్రీనివాస్ తెలిపారు. మరి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో పారిశు ద్ధ్య శుభ్రత పనులు ఆశా వర్కర్లను సన్మానించుకోవటం అంగనవాడి మహిళా అక్కలను అక్కున చేర్చుకోవడం.. మరియు ముఖ్యంగా దేశ సైనికులు రైతులను గౌరవించుకోవడం.. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించడం.. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న విద్యార్థులను వారి తల్లిదండ్రులను సమావేశపరిచి దేశంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను వాళ్లకు తెలియజేయడం యువత మాద కద్రవ్యాల వల్ల చెడిపోయే విషయాన్ని తెలియజేస్తూ వారికి అవ గాహన సదస్సులు ఏర్పాటు చేయటం ముఖ్యంగా అన్ని ప్రాంతాలలో చెట్లు నాటడం రక్తదానం చేయడం ఇలా 25 కార్యక్ర మాలను దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ చేపడుతుందని.. ఆంధ్రప్రదేశ్లో కూడా భారతీయ జనతా పార్టీ ఈ నెల రోజులు ప్రతి గ్రామంలో నరేంద్ర మోడీ పుట్టినరోజు వేడుకలు సేవా కార్యక్రమా లను చేపడుతున్నట్లు దర్శనపు శ్రీనివాస్ మీడియాకు తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టుల జాతికి అంకితం చేసిన కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ రాబోవు రోజుల్లో భారతీయ జనతా పార్టీ ప్రతినిత్యం కూడా ప్రజలకు అందుబాటులో ఉంటుందని ప్రభుత్వానికి ప్రజలకు వారధి భారతీయ జనతా పార్టీ అని దర్శనపు శ్రీనివాస్ మీడియాకు వివరించారు.

# గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

**సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు నమ్మొద్దు : ఏవీ రంగనాథ్ వెల్లడి**

**హైదారాబాద్, సెప్టెంబర్ 10:** హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని ఆయన ఫుల్ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయో డైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తుచేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటిలాగే యథావిధిగా సాగుతాయని స్పష్టం చేశారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా 'బేబీ పాండ్స్' ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎటువంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణ హితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

## అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు

**తుమ్మల పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు**

**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :** కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందిస్తున్న తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు. "మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పని చేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు" అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని... ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా, వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని, ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారని పేర్కొన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.

## ఈనెల 17 న ఘనంగా ప్రజా పాలనా దినోత్సవం

**పబ్లిక్ గార్డెన్ లో విస్తృత ఏర్పాట్లు చేయాలి**

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**ఏర్పాట్లపై సచివాలయంలో సిఎస్ సమీక్ష**

**హైదారాబాద్, సెప్టెంబర్ 10:** ఈనెల 17 వతేదీన నాంపల్లి లోని పబ్లిక్ గార్డెన్ లో నిర్వహించే తెలంగాణా ప్రజా పాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ప్రజాపాలన దినోత్సవం నిర్వహణా ఏర్పాట్లపై గురువారం డా. బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్, హైదాబాద్ సి.పీ సజ్జనార్, ఆర్టీసీ ఎండి నాగి రెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితర సీనియర్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, ప్రజా పాలనా దినోత్సవాన్ని పబ్లిక్ గార్డెన్ లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 17 న ఉదయం అసెంబ్లీ ఎదురుగా గల అమరవీరుల స్థూపం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి నివాళులు అర్పించిన అనంతరం పబ్లిక్ గార్డెన్ కు వస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపంవద్ద, పబ్లిక్ గార్డెన్ లో సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని పలు ప్రధాన భవనాలకు , చారిత్రక కట్టడాలకు విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణ కు గానూ ఈనెల 15 న పూర్తి డ్రెస్ రిహార్సల్స్ ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రజాపాలన దినోత్సవానికి వేయి మంది స్వయం సహాయక మహిళలతో పాటు రెండు వేల మంది హాజరవుతారని పేర్కొన్నారు.

## 8,283 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

**వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**

**సంబంధిత శాఖల అధికారులకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశం**

**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :** 2026-27 వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 2026-27 వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, సుమారు 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు సీఎస్ తెలిపారు. ఇందులో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. 2026-27 వానాకాల ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ సంజయ్ జాజు గురువారం డా. బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. గత వానాకాలం సీజన్‌లో సుమారు 70 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి, 154.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సీఎస్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,283 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఇతర కొనుగోలు ఏజెన్సీల సమన్వయంతో కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమవుతుందని, నవంబర్‌లో పెద్దఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం రవాణా, హమాలీల ఏర్పాటు, గోదాములు, నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించాలని సీఎస్ సూచించారు. రైతుల ఆధార్ వివరాలను చెల్లింపుల కోసం ఉపయోగించే బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసే ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వ, చెల్లింపుల ప్రక్రియలో ఎక్కడా జాప్యం లేకుండా శాఖల మధ్య సమన్వయం ఉండాలని, రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు.

# భూముల కేటాయింపు నిబంధనలకు విరుద్ధం

**రేవంత్‌రెడ్డి సోదరుడుకి అక్రమ కేటాయింపులు**

**200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని ఇచ్చారు**

**ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించాం**

**ప్రశ్నించినందుకే ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారు**

**బినామీ కంపెనీల లబ్ధికోసమే సిఎం పనిచేస్తున్నారు**

**'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్'తో అక్రమ ఒప్పందాలు**

**ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో అంత దోపిడీ**

**సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి**

**వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోన్న ప్రభుత్వం**

**నిజాయతీ ఉంటే వెంటనే కేంద్రం స్పందించాలి**

**సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలు వెలికితీయాలి**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు**

**రేవంత్ రెడ్డికి సొంత ఊరి నుంచే కౌంట్‌డౌన్ షురూ**

**ఫ్యూచర్ సిటీలో కొండల్ రెడ్డి భూముల పరిశీలన**

**ఫ్యూచర్ సిటీ భూముల వద్ద తీవ్ర ఉద్రిక్తత..**

**కేటీఆర్, హరీశ్ రావు ఆధ్వర్యంలో భారీ నిరసన!**




**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. టెస్సరాక్ట్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన భూములను పరిశీలించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం క్షేత్రస్థాయికి చేరుకుంది. కొండల్ రెడ్డికి అనుకూలంగా ప్రభుత్వం ఈ భూములను కట్టబెట్టిందని ప్రధానంగా ఆరోపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, వివాదాస్పద భూములను స్వయంగా పరిశీలించేందుకు తుక్కుగూడ పరిసర ప్రాంతాలకు భారీ కాన్వాయ్‌తో చేరుకోవడంతో ఒక్కసారిగా అక్కడ తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ పరిశీలన పర్యటనలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. చేతుల్లో ప్లకార్డులు, భారీ బ్యానర్లు పట్టుకుని నేతలు ఆందోళన నిర్వహించారు. ప్రజాధనంతో ముడిపడి ఉన్న విలువైన ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై వారు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ సంఘటనా స్థలంలో నిరసన చేపట్టారు. ఈ భూముల అంశం అసెంబ్లీలోనూ తీవ్ర గందరగోళానికి దారితీసింది. సభలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నంలో భాగంగా పోడియం వద్దకు దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను ఖండిస్తూ పోడియం వద్ద పేపర్లు చింపి పైకి ఎగురవేయడంతో సభలో గందరగోళం తలెత్తింది. సభ్యుల ఆందోళన అదుపు తప్పడంతో స్పీకర్/చైర్మన్ జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడేందుకు మార్షల్స్‌ను రంగంలోకి దించాలని ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీలో నిరసనల అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన కోసం కేటీఆర్, హరీశ్ రావు నేతృత్వంలోని ఎమ్మెల్యేలు తుక్కుగూడలోని టెస్సరాక్ట్ సైట్‌కు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న భూకేటాయింపులపై పూర్తిస్థాయి వాస్తవాలను ప్రజల ముందుకు తెస్తామని, ఈ అంశంపై న్యాయపరమైన, ప్రజా పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. నాయకుల రాకతో స్థానిక పరిసరాల్లో భారీగా మోహరించిన పోలీసులు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. పర్యవేక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరైనా కేవలం లక్ష రూపాయలతో స్టార్టప్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వందల కోట్ల విలువైన భూములు ఇస్తుందా..? అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడుతోందని ఆరోపించారు. నెలకు రూ. 4,000 పింఛన్, మహిళలకు రూ. 2,500, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లి సమీపంలోనే రైతులు కరెంట్ కోసం రోడ్డెక్కడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమనిమాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి సమీపంలోని శ్రీశైలం--హైదరాబాద్ జాతీయ రహదారిపై రైతులు మెరుపు ధర్నాకు దిగడం, ట్రాక్టర్లతో రాస్తారోకో చేయడం ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతూ రేవంత్ రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. పంటలు ఎండిపోతుంటే రైతులు రోడ్డెక్కారు.. కానీ ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టింపు లేకపోవడం దుర్మార్గమని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు 24 గంటల కరెంట్ హామీ ఇచ్చి, ఇప్పుడు రైతులకు 6--8 గంటల విద్యుత్ కూడా సరఫరా చేయకపోవడం శోచనీయమని అన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం, వారి గోడును పట్టించుకోకుండా చోద్యం చూడడం విడ్డూరమని తెలిపారు. ముఖ్యమంత్రి సొంత గ్రామానికి కూతవేటు దూరంలోనే రైతులు కరెంట్ కోసం జాతీయ రహదారిపైకి రావాల్సి పరిస్థితిని వస్తే దాన్ని 'ప్రజా పాలన' అంటారా? అని నిలదీశారు. సొంత ఇలాకాలోని రైతుల సమస్యలే పరిష్కరించలేని సీఎం , తెలంగాణలోని లక్షలాది మంది రైతుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారు? ఇదేనా కాంగ్రెస్ తెచ్చిన 'మార్పు' . రైతుల ఆక్రందన రేవంత్ రెడ్డికి వినిపించడం లేదా ? ఇప్పటికైనా రేవంత్ రెడ్డి మొద్దునిద్ర వీడి రైతుల పొలాలకు 24 గంటల కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ పార్టీ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తోంది

**ఫేక్ సోషల్ మీడియా ద్వారా మాపై దాడిచేస్తోంది**

**ఫేక్ వార్తను అసెంబ్లీలో రేవంత్ ప్రస్తావిస్తున్నారు**

**సభకు, ప్రజలకు సిఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి**

**సిఎంపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తాం**

**రేవంత్ రెడ్డి మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు..**

**మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు రేవంత్**

**బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి**

**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :** కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ఫేక్ అకౌంట్లను సృష్టించి ప్రతిపక్షాలపై అత్యంత దుర్మార్గమైన దాడికి పాల్పడుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులే స్వయంగా నిర్వహిస్తున్న ఒక ఫేక్ అకౌంట్‌లోని పోస్టులను పట్టుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం కన్నా దౌర్భాగ్య పరిస్థితి మరొకటి లేదని ఎద్దేవా చేశారు. తాజాగా సోషల్ మీడియాలో కలకలం రేపుతున్న 'సంధ్యా రావు' అనే ఫేక్ అకౌంట్ వెనుక కాంగ్రెస్ పార్టీ హ్యాండ్లర్లే ఉన్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆ నకిలీ ఖాతాలో చేసిన వ్యాఖ్యల ఆధారంగా ముఖ్యమంత్రి శాసనసభను తప్పుదోవ పట్టించారని, దీనికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి వెంటనే సభకు, ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సదరు ఫేక్ అకౌంట్‌పై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, దాని వెనుక ఉన్న ముఠాను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన అంశంపై ముఖ్యమంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని... అలాగే ఈ పరువు నష్టం, నకిలీ ఖాతాల వ్యవహారంపై పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు.. మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అదే మహబూబ్ నగర్ జిల్లాలో భీమా ప్రాజెక్టులో 3 మోటార్లు ఉంటే ఒక్క మోటార్ మాత్రమే నడుపుతున్నారు. నికర జలాల కేటాయింపులున్న ప్రాజెక్ట్ భీమా. కానీ ఏ జలాల కేటాయింపులు లేని, బేసిన్ లేని వెలిగొండకి మాత్రం చంద్రబాబు నీళ్లు తీసుకుపోతడు.. బేసిన్లు ఉన్న నికర జలాల కేటాయింపులు ఉన్న అన్ని అనుమతులున్న భీమా మోటార్లు ఎందుకు నడపడం లేదు రేవంత్ రెడ్డి.. ఇదేనా నీకు పాలమూరు మీద ఉన్న ప్రేమ అని హరీశ్ రావు అడిగారు.కరువు పీడిత ప్రాంతం నడిగడ్డ, గద్వాల, అలంపూర్ ప్రాంతానికి నీళ్లిచ్చే నెట్టంపాడులో 4 మోటార్లు ఉంటే ఒకటే నడుపుతున్నారన్నారు హరీశ్ రావు . కోయిల్ సాగర్‌లో 3 మోటార్లు ఉంటే ఒక్కటే నడుపుతున్నారు. రెండు మోటార్లు నడిపితేనే కోయిల్ సాగర్ నిండడానికి 3 నెలలు పడుతుంది.. ఇప్పుడు నువ్వు ఒక్కటే మోటార్ నడిపితే అది నిండడానికి 6 నెలలు పడుతుంది. 6 నెలల వరకు జూరాల ప్రాజెక్టులో నీళ్లు ఉంటాయా..? కోయిల్ సాగర్ నిండుతదా అని ప్రశ్నించారు. నీళ్లు ఉండి మోటార్లు నడపలేని చాతకాని ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నానన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు 2014-15 నుండి 2023-24 వరకు ప్రతి సంవత్సరం వచ్చిన కృష్ణ నది నీళ్లలో 45 శాతం నుండి 30 శాతం ఎత్తామని.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25లో 28.49 శాతం నీళ్లు ఎత్తారు, 2025-26లో 25 శాతం మాత్రమే ఎత్తారని హరీశ్ రావు తెలిపారు. దీన్ని బట్టి ఎవరు తెలంగాణ ప్రయోజనాలు కాపాడారో అర్థం కావడం లేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కృష్ణ జలాల్లో అతి తక్కువ సాగు నీరు వాడుకున్నది ఈ మూడు సంవత్సరాలలోనేనన్నారు.

## 90 ఎంఎల్ వేసుకుని ఆ ఫేక్ అకౌంట్ సృష్టించారా?

**'సంధ్యా రావు' అనే ఫేక్ ఐడీని కాంగ్రెస్ సృష్టించింది**

**రేవంత్ రెడ్డిపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆగ్రహం**

**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :** శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'సంధ్యా రావు' అనే ఎక్స్ ఐడీ చేసిన ట్వీట్ ను ప్రదర్శించడంపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీలో ఒక నకిలీ ఖాతా ఆధారంగా సీఎం మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని, అసలు ఏ రాజకీయ పార్టీకైనా 'అంతర్జాతీయ కార్యదర్శి' అనే పదవి ఉంటుందా అని ఆయన ఎద్దేవా చేశారు. ప్రపంచంలో ఏ రాజకీయ పార్టీకి కూడా అంతర్జాతీయ కార్యదర్శి అనే పదవి ఉండదని... సీపీఐ, సీపీఎం, బీజేపీ, కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్ ఏ పార్టీ చూసుకున్నా ఇలాంటి హోదా ఉండదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు. అలాంటిది 'సంధ్యా రావు' అనే పేరుతో బీఆర్ఎస్ అంతర్జాతీయ కార్యదర్శి అని రేవంత్ రెడ్డే కొత్త పదవిని సృష్టించారని దుయ్యబట్టారు. ఫేక్ ఐడీ పోస్టులను సృష్టించేటప్పుడు కాంగ్రెస్ నేతలు లేదా సీఎం ఏమైనా '90ఎంఎల్' వేసుకుని ఉన్నారా? అని ఘాటుగా ప్రశ్నించారు. ఈ డ్రామా వెనుక ఉన్న అసలు సూత్రధారి రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. కాంగ్రెస్ ఐటీ సెల్ ద్వారానే 'సంధ్యా రావు' అనే ఫేక్ ఐడీని సృష్టించి, దాంతో తప్పుడు పోస్టులు పెట్టించి, ఆపై అదే అంశంపై రేవంత్ రెడ్డే స్వయంగా సిట్ విచారణకు ఆదేశించడం విచిత్రంగా ఉందని ధ్వజమెత్తారు.

## పదవి ఇచ్చేది అధిష్ఠానం.. రేవంత్‌రెడ్డి కాదు

**కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు**



**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :** సీఎం, తాను ఎప్పుడూ తిట్టుకోవాలని కొందరి చూస్తున్నారని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. సీఎంతో తనకు భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయన్నారు. మంచి జరిగితే మంచి, చెడు జరిగితే చెడు అని చెప్పడం తన నైజమని వివరించారు. అసెంబ్లీలో సీఎల్పీ సమావేశం అనంతరం ఆయన మీడియా చిట్?చాట్ నిర్వహించారు. మంత్రి పదవి కోసం రాజీపడినట్లు ప్రచారం చేస్తున్నారని, కానీ కలిస్తే కాంప్రమైజ్, కలవకపోతే గ్యాప్ పెరిగిందని ప్రచారం చేయడం సరికాదన్నారు. మంత్రి పదవి ఇచ్చేది అధిష్ఠానం కానీ రేవంత్‌రెడ్డి కాదని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు.

# భారత్ వైపు ప్రపంచం చూపు

రేపు, ఎల్లుండి ఢిల్లీలో భారత్ అధ్యక్ష బాధ్యతల్లో బ్రిక్స్ సదస్సు

డిజిటల్ కరెన్సీ ప్రతిపాదనపై చర్చ

రేపు పుతిన్.. ఎల్లుండి జిన్ పింగ్ తో ప్రధాని మోడీ చర్చలు

భారీ పోలీసు బందోబస్తు..

ఢిల్లీలో నిషేధాజ్ఞలు

35 రోడ్లపై ట్రాఫిక్ ఆంక్షలు.. 22 ప్రాంతాల్లో వాహనాల మళ్లింపు



**న్యూఢిల్లీ:** భారత్ వేదికగా 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈ సదస్సును నిర్వహించనున్నారు. 2026లో బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టిన నేపథ్యంలో ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. బ్రిక్స్ ఏర్పాటై 20 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జరుగుతున్న ఈ సదస్సుపై ప్రపంచ దేశాల దృష్టి నెలకొంది. ప్రపంచ స్థాయి నేతలు హాజరవుతున్న నేపథ్యంలో ఢిల్లీలో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. విమానాశ్రయాలు, హోటళ్లు, భారత్ మండపం పరిసరాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. దాదాపు 30 వేల మంది భద్రతా సిబ్బందిని విధుల్లో మోహరించినట్లు సమాచారం. కీలక మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల తనిఖీలు, హోటల్ సిబ్బంది నేపథ్య పరిశీలన వంటి చర్యలు చేపట్టారు. ఈ సదస్సుకు బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల నేతలు, ఆహ్వానిత దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. స్థిరమైన అభివృద్ధి, ఆర్థిక సహకారం, వాణిజ్యం, సాంకేతికత, ఇంధన భద్రత, ఆహార భద్రత, ఆరోగ్యం, విపత్తుల నిర్వహణ, కీలక సరఫరా వ్యవస్థల బలోపేతం వంటి అంశాలే ప్రధాన ఎజెండాగా నేతలు చర్చించనున్నారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య అంతరాయాల నేపథ్యంలో సప్లయ్ చైన్ ను మరింత పటిష్ఠం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పశ్చిమాసియా ఉద్రిక్తతలు సదస్సులో కీలక అంశంగా మారనున్నాయి. ఇరాన్, యూఏఈ మధ్య విభేదాలు బ్రిక్స్లో ఏకాభిప్రాయ సాదనకు సవాలుగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రాంతీయ సంక్షోభంపై సభ్య దేశాల మధ్య సమతుల్య వైఖరితో ఉమ్మడి ప్రకటన తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

### డిజిటల్ కరెన్సీలపై భారత్ ప్రతిపాదన

బ్రిక్స్ దేశాల మధ్య సరిహద్దు చెల్లింపులను సులభతరం చేసేందుకు సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీలను అనుసంధానించే ప్రతిపాదనను భారత్ ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉంది. సభ్య దేశాల డిజిటల్ కరెన్సీల మధ్య పరస్పర అనుసంధానం ఏర్పడితే అంతర్జాతీయ చెల్లింపులు వేగంగా, తక్కువ ఖర్చుతో జరిగే అవకాశం ఉందని భారత్ భావిస్తోంది. అయితే ఈ ప్రతిపాదనకు సాంకేతిక, రాజకీయ పరమైన సవాళ్లు ఉన్నాయని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు.

### మోడీ-జిన్పింగ్ భేటీపై ఆసక్తి

చైనా అధ్యక్షుడు జిన్పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రామఫోసాతో పాటు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్, ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దెల్ ఫత్తా ఎల్-సిసి, ఇథియోపియా ప్రధాని అబీ అహ్మద్. ఇండొ "నేషియా అధ్యక్షుడు ప్రబోవోసుబియాంటో, యూఏఈలోని అబుదాబి యువరాజు షేక్ ఖలీద్ బిన్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మౌరోవీరాతో పాటు యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్.. హాజరు కానున్నారు. వీరితో పాటు బెలారస్, కజికిస్థాన్, క్యూబా, నైజీరియా, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షులు, మలేషియా, థాయిలాండ్ ప్రధానులతో పాటు ఉగాండా ఉపాధ్యక్షుడు హాజరుకానున్నారు. చైనా అధ్యక్షుడు జిన్పింగ్ ఏడేళ్ల తర్వాత శనివారం నాడే భారత్కు వస్తుండటంతో మోడీ-జిన్పింగ్ భేటీపై ఆసక్తి నెలకొంది. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం, ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరిగే అవకాశం ఉంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తో కూడా ప్రధాని మోడీ కీలక చర్చలు జరపనున్నారు.

### ఆహ్వానం అందలేదు.. వెళ్లడం లేదు: బంగ్లాదేశ్

బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు బంగ్లాదేశ్ దూరంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. ప్రధాని తారిక్ రెహమాన్ భారత్లో పర్యటించే అవకాశాన్ని బంగ్లాదేశ్ తోసిపుచ్చింది. సరైన రీతిలో తమ ప్రధానికి ఆహ్వానం అందలేదని బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ పేర్కొన్నారు. రెహమాన్కు ఆహ్వానం బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి హోదాలో కాకుండా దక్షిణాసియా, ఆగ్నేయ. తూర్పు ఆసియా దేశాల కూటమి (బిమ్స్ టెక్) చైర్మన్ హోదాలో ఇచ్చారని కబీర్ సమాచారమిచ్చారు.

## దీర్ఘకాలిక స్థిరత్వంపై దృష్టి

### బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రులతో భేటీలో ప్రధాని మోడీ

బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. దీర్ఘకాలిక స్థిరత్వంపై దృష్టి సారించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని మోడీ పేర్కొన్నారు. బహుపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయడం, ప్రపంచ పాలనలో అభివృద్ధి చెందుతున్న దేశాల పాత్రను పెంచడం బ్రిక్స్ లక్ష్యాల్లో కీలకమని స్పష్టం చేశారు. న్యూఢిల్లీలో గురువారం తనను కలిసిన బ్రిక్స్ దేశాల విదేశాంగ మంత్రులు, ప్రతినిధి బృందాల అధిపతులతో మోడీ సంభాషించారు. వర్ధమాన ఆర్థిక వ్యవస్థల మధ్య సహకారాన్ని పెంపొందించడానికి, గ్లోబల్ సౌత్ ఆకాంక్షలకుగళం విప్పడానికి బ్రిక్స్ ఒక ముఖ్యమైన వేదికగా ఆవిర్భవించిందని అన్నారు. అంతర్జాతీయ సమస్యలకు చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కారాలు కనుగొనాల్సిన అవసరాన్ని భారత్ పదేపదే నొక్కిచెబుతోంది. ఇటీవల రష్యా 1. అధ్యక్షుడు పుతిన్తో జరిగిన సమావేశంలోనూ మోడీ ఇదే వైఖరిని వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

# లడఖ్కు త్వరలోనే ప్రత్యేక హోదా..

### ఆర్టికల్ 371 సవరణకు కేంద్రం కసరత్తు

**న్యూఢిల్లీ :** గత నాలుగేళ్లుగా లడఖ్ ప్రజలు చేస్తున్న డిమాండ్ నెరవేరే సూచనలు కనిపిస్తున్నాయి. లడఖ్ ప్రాంతానికి ఆర్టికల్ 371 కింద రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అలాగే హిమాలయ ప్రాంతమైన లడఖ్ పాలన కోసం భారతదేశంలోనే మొదటిసారిగా 'సూయి జెనెరిస్' నమూనాలో ఒక ఎన్నికైన పాలక మండలిని ఏర్పాటు చేయనున్నారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో లడఖ్ చీఫ్ సెక్రటరీ ఆశిష్ కుంద్రా మాట్లాడుతూ.. లడఖ్కు తగిన రాజ్యాంగ పరిరక్షణలు కల్పించేందుకు పార్లమెంట్ ఆర్టికల్ 371ని సవరిస్తుందని తెలిపారు. లడఖ్కు రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడం, ఎన్నికైన మండలిని ఏర్పాటు చేసే ప్రక్రియను కేంద్ర హోం శాఖ ఇప్పటికే ప్రారంభించిందని ఆయన చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 నిర్దిష్ట రాష్ట్రాల ప్రత్యేక ప్రాంతీయ, సామాజిక అవసరాలను తీర్చడానికి తాత్కాలిక, పరివర్తన, ప్రత్యేక అధికారాలను అందిస్తుంది. "మేము ఒక ప్రత్యేకమైన పాలనా నమూనాపై పనిచేస్తున్నాం... ఇది 'సూయి జెనెరిస్' మోడల్. లడఖ్లో ఎన్నికైన పాలక మండలి ఉంటుంది, కానీ ఇది శాసనసభ ఉన్న కేంద్రపాలిత ప్రాంతంగానీ లేదా రాష్ట్రంగానీ కాదు" అని కుంద్రా వివరించారు. 'సూయి జెనెరిస్' అనేది ఒక ప్రత్యేక పరిస్థితిని నిర్వహించడానికి రూపొందించిన ఒక ప్రత్యేకమైన చట్టపరమైన వ్యవస్థ. ఈ లాటిన్ పదానికి 'తనదైన శైలి' లేదా 'ప్రత్యేకమైనది' అని అర్థం. లడఖ్ నాయకులతో చర్చలు జరుపుతున్న కేంద్ర ప్రభుత్వ బృందంలో ఆశిష్ కుంద్రా భాగస్వామిగా ఉన్నారు. మంగళవారం ఢిల్లీలో ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగాయి. ఆర్టికల్ 370 రద్దుచేసిన కేంద్రం జమ్మూ కశ్మీర్, లడఖ్గా విభజించి ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రారంభంలో లడఖ్లోని ఒక వర్గం కేంద్ర నిర్ణయాన్ని స్వాగతించినప్పటికీ, కాలక్రమేణా అధికారుల పాలనకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. వారు రాష్ట్ర హోదాతో పాటు రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ కింద ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఆరో షెడ్యూల్ ప్రకారం భూమి, అడవులు, నీరు, వ్యవసాయంపై చట్టాలు చేసే అధికారంతో స్థానిక కౌన్సిళ్లను ఏర్పాటు చేయవచ్చు. ఇది ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిలో స్థానిక సమాజాలకు ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని అందిస్తుంది. గతేడాది లేహ్లో భద్రతా బలగాలు, పౌరుల మధ్య జరిగిన ఘర్షణల్లో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఈ హింస తర్వాత సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ సహా పదుల సంఖ్యలో ప్రజలను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మెజారిటీ ప్రజలపై కేసులను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. చార్జ్షీట్ దాఖలైన కేసులపై లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని కుంద్రా తెలిపారు.

# ట్రంప్ డివిడెండ్

### రిపబ్లికన్లు గెలిస్తే ప్రతి అమెరికన్కు 5 వేల డాలర్లు

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన హామీ




**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర చర్చనీయాంశమైన ప్రకటన చేశారు. రాబోయే మధ్యంతర ఎన్నికల్లో తమ రిపబ్లికన్ పార్టీ విజయం సాధించి, కాంగ్రెస్లోని ఉభయ సభలపై నియంత్రణ సాధిస్తే.. దేశంలోని ప్రతి వయోజన అమెరికా పౌరుడికి 5,000 డాలర్లు (సుమారు రూ.4.2 లక్షలు) ఇస్తామని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ సంక్షేమాన్ని ఆయన "ట్రంప్ డివిడెండ్ గా పేర్కొన్నారు. టెక్సాస్లోని డల్లాస్లో జరిగిన రిపబ్లికన్ పార్టీ మధ్యంతర ఎన్నికల సభలో డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రతిపాదన చేశారు. డెమోక్రాట్లతో పోటీలో రిపబ్లికన్ పార్టీ ఓటింగ్ సర్వేల్లో వెనుకబడి ఉన్న నేపథ్యంలో, ఓటర్లను ఆకర్షించేందుకు ట్రంప్ ఈ అసాధారణ హామీ ఇచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సభలో ట్రంప్ మాట్లాడుతూ.. "అమెరికా అద్భుతమైన ఆర్థిక విజయం కారణంగా ఈ హామీ నేను మాత్రమే చేయగలను. నవంబర్ 3న జరగబోయే ఎన్నికల్లో రిపబ్లికన్లు గెలిస్తే, మీరు మాతో కలిసి గెలుస్తారు. మీకు 5,000 డాలర్లు లభిస్తాయి. నవంబర్ బ్యాలెట్లో నేను స్వయంగా పోటీలో ఉన్నట్లే భావించి ఓటు వేయండి" అని మద్దతుదారులను కోరారు. ట్రంప్ డెవిడెండ్ హామీ అమలుపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అమెరికాలో దాదాపు 27 కోట్ల మంది వయోజనులు ఉన్నారు. ప్రతి ఒక్కరికీ 5,000 డాలర్ల చొప్పున పంపిణీ చేయాలంటే ప్రభుత్వానికి సుమారు 1.35 ట్రిలియన్ డాలర్లు ఖర్చవుతుందని విశ్లేషకులు తెలిపారు. అయితే, ఈ భారీ మొత్తం నిధులు ఎక్కడి నుంచి వస్తాయనే దానిపై ట్రంప్ స్పష్టత ఇవ్వలేదు. "మన దేశం చాలా డబ్బు సంపాదిస్తోంది" అని మాత్రమే ట్రంప్ చెప్పారు. ఈ చెల్లింపుల ప్రక్రియ ఎలా పనిచేస్తుంది, అసలు ఇలా డబ్బులు పంచడం చట్టబద్ధమేనా అనే అంశాలపై ఇంకా స్పష్టత లేదు. మధ్యంతర ఎన్నికల్లో గెలవడం కోసం ట్రంప్ బహిరంగంగా ఓటర్లకు లంచం ఇస్తున్నారని విమర్శకులు, సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. "రిపబ్లికన్లకు ఓటు వేస్తే $5,000 ఇస్తాననడం డివిడెండ్ ఎంతమాత్రం కాదు.. అది పక్కా లంచం" అని ఎక్స్ వేదికగా నెటిజన్లు ఆరోపించారు. ప్రముఖ అమెరికన్ స్టాక్ బ్రోకర్ పీటర్ షిఫ్ స్పందిస్తూ.. "ఓటర్లను ఆకట్టుకోవడానికి ట్రంప్ ఈ రకమైన ప్రతిపాదన చేశారు. ఈ ఉచిత డబ్బు కోసం ఫెడరల్ రిజర్వ్ భారీగా కరెన్సీ నోట్లను ముద్రించాల్సి వస్తుంది. ఫలితంగా బైడెన్ హయాంలో చూసిన దానికంటే అతి తీవ్రమైన ద్రవ్యోల్బణం వచ్చే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు. ఓట్ల కోసం ట్రంప్ చేసిన ఈ 1 ట్రిలియన్ డాలర్ల వాగ్దానం ఇప్పుడు అమెరికా వ్యాప్తంగా తీవ్ర రాజకీయ, ఆర్థిక చర్చకు దారితీసింది.

## నేడు దేశ వ్యాప్తంగా బ్యాంకుల సమ్మె

### వరుసగా 4 రోజుల పాటు బ్యాంకింగ్ సేవలపై ప్రభావం

**న్యూఢిల్లీ :** చాలా కాలంగా పెండింగ్లో ఉన్న తమ డిమాండ్ల సాధన కోసం బ్యాంకు ఉద్యోగుల సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులు శుక్రవారం సమ్మె పాటించనున్నాయి. వారానికి ఐదు రోజుల పని దినాల విధానం అమలు సహా పలు డిమాండ్ల సాధనకు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్(యూఎఫ్బీయూ) ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. దీంతో సెప్టెంబరు 11న వివిధ బ్యాంకుల శాఖలు మూతపడనున్నాయి. లావాదేవీల నిర్వహణకు ఖాతాదారులు ఇంటర్నెట్ బ్యాంకింగ్, ఏటీఎం కేంద్రాలు వంటి ప్రత్యామ్నాయాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అయితే, బ్యాంకు ఉద్యోగుల సంఘాలు శుక్రవారం మాత్రమే బంద్కు పిలుపునిచ్చినప్పటికీ.. వరుసగా నాలుగు రోజుల పాటు ఆ ప్రభావం ఉండనుంది. శుక్రవారం సమ్మె కాగా శని(నెలలో రెండో శనివారం), ఆదివారాలు సాధారణంగానే బ్యాంకులకు సెలవు దినాలు. ఇక, వినాయక చవితి సందర్భంగా చాలా రాష్ట్రాల్లో సోమవారం బ్యాంకులకు సెలవు దినంగా ఇప్పటికే ప్రకటించారు. దీంతో వరుసగా నాలుగు రోజుల పాటు పలు బ్యాంకింగ్ సేవలకు అంతరాయం ఏర్పడే అవకాశముంది.

## చైనా షిప్యార్డ్లో అగ్నిప్రమాదం

### మరమ్మతుల కోసం ఆగిన కార్గో నౌక.. 20 మంది మృతి, ఐదుగురు గల్లంతు

**న్యూఢిల్లీ :** చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. కింగ్డావో బీహై షిప్యార్డ్లో మరమ్మతుల నిమిత్తం నిలిపి ఉంచిన ఒక కార్గో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ విషాద ఘటనలో సుమారు 20 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. లైబీరియా జెండాతో ఉన్న 'ఓషన్ మెలోడీ' అనే కార్గో నౌకను మరమ్మతుల కోసం షిప్యార్డ్కు తీసుకువచ్చారు. పనులు జరుగుతున్న క్రమంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. ప్రమాదం సంభవించిన సమయంలో నౌకలో మొత్తం 42 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై చైనా అధ్యక్షుడు జీ జిన్పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, ప్రమాదానికి గల కారణాలపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నౌకలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రధాని లీ కియాంగ్ స్పష్టం చేశారు. చైనా స్టేట్ షిప్బిల్డింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడిచే కింగ్డావో బీహై షిప్యార్డ్, ఆ దేశంలోని అతిపెద్ద నౌకా నిర్మాణ, మరమ్మతు కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది.

## డీకే శివకుమార్ ప్రభుత్వం సరైన దిశలోనే వెళుతోంది

### మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ:** కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలోని ప్రభుత్వం సరైన దిశలోనే పయనిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు, ఆయన మంత్రివర్గానికి సిద్ధరామయ్య అభినందనలు తెలియజేశారు. విధానసౌధలోని బాంక్వెట్ హాల్లో గురువారం నిర్వహించిన 'దృఢ కర్ణాటక సంకల్ప - 100 రోజుల విజయవంతమైన ప్రస్థానం' కార్యక్రమంలో సిద్ధరామయ్య ప్రసంగించారు. 100 రోజుల మైలురాయి అనేది కేవలం వేడుకలకు పరిమితం కాకూడదని, ప్రభుత్వం తన పనితీరును ప్రజల ముందు ఉంచి, బాధ్యతలను ఏ మేరకు నెరవేరుస్తోందో నిరూపించుకోవడానికి ఇదొక చక్కని అవకాశమని ఆయన పేర్కొన్నారు. డీకే శివకుమార్ నేతృత్వంలోని సర్కార్ సరైన మార్గంలోనే సాగుతోందని తాను భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురైనప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఐదు గ్యారెంటీ పథకాలను విజయవంతంగా అమలు చేసిందని సిద్ధరామయ్య గుర్తు చేశారు. ఈ పథకాల కోసం ఏటా సుమారు రూ. 52,000 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఆయన వివరించారు. సామాజిక అసమానతలను తొలగించి, అన్ని వర్గాల పేదలకు అండగా నిలవడమే ఈ పథకాల ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఇదే తరుణంలో ప్రతిపక్ష బీజేపీ తీరుపై సిద్ధరామయ్య విమర్శలు గుప్పించారు. బీజేపీ చేపట్టిన 'బళ్లారి చలో' పాదయాత్రను కేవలం ఒక రాజకీయ గిమ్మిక్కుగా ఆయన అభివర్ణించారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలోని కరువు పరిస్థితులపై చర్చించకుండా, కేవలం మాజీ మంత్రి నాగేంద్ర రాజీనామా అంశంపైనే బీజేపీ రాజకీయం చేస్తోందని ఆరోపించారు. కరవు సహాయక చర్యల కోసం పూర్తిగా కేంద్రంపైనే ఆధారపడవద్దని, అవసరమైన తాలూకాలను కరవు ప్రాంతాలుగా ప్రకటించి, రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకోవాలని సీఎం శివకుమార్కు సూచించారు. పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉండాలని ఆయన కోరారు.

## టీవీకే పార్టీకి అధికారిక గుర్తింపు

### రాష్ట్ర పార్టీ హోదా కల్పిస్తూ ఈసీ నిర్ణయం

**న్యూఢిల్లీ:** ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాష్ట్ర పార్టీగా అధికారిక గుర్తింపునిచ్చింది. పార్టీకి శాశ్వత ఎన్నికల గుర్తుగా 'విజిల్'ను కేటాయిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే కనబరిచిన అద్భుత పనితీరు ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన టీవీకే, మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. రాష్ట్రవ్యాప్తంగా పోలైన ఓట్లలో 34.92 శాతం సాధించి తన సత్తా చాటింది. ఎన్నికల నిబంధనల ప్రకారం, ఒక పార్టీకి రాష్ట్ర పార్టీ హోదా దక్కాలంటే కనీసం 6 శాతం ఓట్లతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలు గెలవాలి లేదా మొత్తం ఓట్లలో 8 శాతం సాధించాలి. టీవీకే ఈ నిబంధనలను సునాయాసంగా అధిగమించి ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు 'విజిల్'ను ఉమ్మడి గుర్తుగా ఈసీ కేటాయించగా, ఎన్నికల్లో సాధించిన ఘన విజయం నేపథ్యంలో ఇప్పుడు అదే గుర్తునే శాశ్వతంగా ఖరారు చేసింది. తాజా గుర్తింపుతో భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ టీవీకే ఇదే గుర్తుపై పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడులో ఇప్పటికే గుర్తింపు పొందిన డీఎంకే, ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, నామ్ తమిళర్ కట్చి, డీఎండీకే వంటి పార్టీల సరసన ఇప్పుడు టీవీకే కూడా చేరింది. ఫలితంగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీల సంఖ్య ఏడుకు చేరుకుంది. ఈ పరిణామం తమిళ రాజకీయాల్లో టీవీకేను ఒక ప్రధాన శక్తిగా ఆవిష్కరించింది.

## నిజ జీవితంలో విజయ్ హీరో కాదు, విలన్

### టీటీవీ దినకరన్ సంచలన వ్యాఖ్యలు

**చెన్నై:** తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్పై ఏఎంఎంకే చీఫ్ టీటీవీ దినకరన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సినిమాల్లోనే విజయ్ హీరో అని, నిజ జీవితంలో మాత్రం ఆయనో ఒక పెద్ద విలన్ అంటూ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అసెంబ్లీలో విజయ్ చేసిన ఒక సైగపై వివాదం చెలరేగిన నేపథ్యంలో దినకరన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల తమిళనాడు అసెంబ్లీలో విజయ్ చేసిన ఒక సైగ, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ను అపహాస్యం చేసేలా ఉందన్న విమర్శలతో రాజకీయ దుమారం రేగింది. 1976 ఎమర్జెన్సీ కాలంలో జైలులో పోలీసుల దాడి కారణంగా స్టాలిన్ దవడ ఎముక విరిగింది. విజయ్ చేసిన సైగ ఆ విషయాన్ని ఎగతాళి చేసేలా ఉందని డీఎంకే నేతలు మండిపడ్డారు. అయితే, ఆ సైగ యాదృచ్ఛికంగా జరిగిందే తప్ప ఉద్దేశపూర్వకం కాదని విజయ్ వివరణ ఇచ్చారు. అయినప్పటికీ ఈ వివాదం సద్దుమణగలేదు. స్వయంగా స్టాలిన్ కూడా ఈ అంశంపై స్పందిస్తూ, జైలులో తాను అనుభవించిన చిత్రహింసలను గుర్తుచేసుకున్నారు. తమిళనాడు రాజకీయ చరిత్రను చదువుకోవాలని విజయ్కు హితవు పలికారు. ఈ వివాదంపై దినకరన్ మరింత ఘాటుగా స్పందించారు. "విజయ్ ఒక స్వార్థపరుడు, తన స్వలాభం కోసం ఎవరినైనా బలి ఇచ్చే మనస్తత్వం ఉన్న వ్యక్తి. ఆయన మాట తీరు, బాడీ లాంగ్వేజ్ చూస్తుంటేనే ఆయన వ్యక్తిత్వం ఎలాంటిదో అర్థమవుతోంది" అని దినకరన్ తీవ్రంగా ఆరోపించారు.

# 13 ఏళ్ల నిరీక్షణకు తెర

## దులీప్ ట్రోఫీ విజేతగా ఈస్ట్ జోన్



### దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో సౌత్ జోన్‌పై ఈస్ట్ జోన్ ఘన విజయం

మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యంతో టైటిల్ కైవసం

13 ఏళ్ల తర్వాత దులీప్ ట్రోఫీని గెలుచుకున్న ఈస్ట్ జోన్

కెప్టెన్ ఇషాన్ కిషన్ (270) భారీ డబుల్ సెంచరీ

మహ్మద్ ఖురేషీకి తొలి ఫస్ట్ క్లాస్ సెంచరీ

చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ విజేతగా నిలిచింది. సౌత్ జోన్‌పై మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో 13 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ, 2012–13 సీజన్ తర్వాత మళ్లీ ప్రతిష్ఠాత్మకమైన ఈ ట్రోఫీని ముద్దాడింది. ఇది ఈస్ట్ జోన్‌కు మూడో దులీప్ ట్రోఫీ టైటిల్ కావడం విశేషం. ఆఖరి రోజు ఆట ప్రారంభమైన తర్వాత ఈస్ట్ జోన్ తమ రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించింది. మహ్మద్ కౌనైన్ ఖురేషీ (116 నాటౌట్) తన కెరీర్‌లో తొలి ఫస్ట్ క్లాస్ సెంచరీతో అదరగొట్టగా, అనుకుల్ రాయ్ (64) అర్ధశతకంతో రాణించాడు. 99.2 ఓవర్లలో 7 వికెట్లకు 388 పరుగులు చేసిన తర్వాత ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు. డిక్లరేషన్ ప్రకటించిన వెంటనే, ఇషాన్ కిషన్ నేతృత్వంలోని ఈస్ట్ జోన్ ఆటగాళ్లు విజయోత్సవాల్లో మునిగిపోయారు. వాస్తవానికి ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లోనే ఈస్ట్ జోన్ తన పట్టు బిగించింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (270) అద్భుతమైన డబుల్ సెంచరీకి, కుమార్ కుశాగ్ర (101) శతకం తోడవడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 708 పరుగుల భారీ స్కోరు సాధించింది. దీనికి సమాధానంగా సౌత్ జోన్ 336 పరుగులకే ఆలౌట్ కావడంతో మ్యాచ్ ఫలితం దాదాపుగా ఖరారైంది. ఇషాన్ కిషన్ రెండో ఇన్నింగ్స్‌లోనూ 80 పరుగులు చేసి, మ్యాచ్ మొత్తంలో 350 పరుగులతో అగ్రస్థానంలో నిలిచాడు. ఈస్ట్ జోన్ విజయంలో ఝార్ఖండ్‌కు చెందిన యువ ఆటగాళ్లు కీలక పాత్ర పోషించారు. కుశాగ్రతో పాటు తన అరంగేట్ర దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లోనే శిఖర్ మోహన్ 85 పరుగులతో ఆకట్టుకున్నాడు. గత దేశవాళీ సీజన్‌లో ప్రదర్శించిన ఫామ్‌ను అతను కొనసాగించాడు. ఈ ముగ్గురి ప్రదర్శనతో ఈస్ట్ జోన్ టైటిల్ విజయంలో ఝార్ఖండ్ ఆటగాళ్ల ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఆఖరి రోజు ఉదయం ఖురేషీ, అనుకుల్ రాయ్ ఏడో వికెట్‌కు 150 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఈ క్రమంలోనే స్లో ఓవర్ రేట్ కారణంగా 73వ ఓవర్‌లో సౌత్ జోన్‌కు అంపైర్లు 5 పరుగుల పెనాల్టీ విధించారు. 96వ ఓవర్లో పేసర్ సీవీ మిలింద్ బౌలింగ్‌లో రెండు పరుగులు తీసి ఖురేషీ తన తొలి ఫస్ట్ క్లాస్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. చెపాక్‌లోని తీవ్రమైన తేమ, ప్రతికూల వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా సౌత్ జోన్ పేసర్ మహ్మద్ సిరాజ్ తన పోరాట పటిమను ప్రదర్శించాడు. మ్యాచ్ ఫలితం తేలిపోయినప్పటికీ, ఏకధాటిగా తొమ్మిది ఓవర్లు బౌలింగ్ చేసి ఆకట్టుకున్నాడు. ఇషాన్ కిషన్ డిక్లరేషన్ ప్రకటించిన వెంటనే, అంపైర్లు బెయిల్స్‌ను తొలగించి మ్యాచ్‌ను ముగించారు. దీంతో ఈస్ట్ జోన్ ఆటగాళ్లు మైదానంలోనే సంబరాలు చేసుకున్నారు. ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ ఒక స్టంప్‌ను చేతిలో పట్టుకుని డ్యాన్స్ చేస్తూ ప్రేక్షకులకు అభివాదం చేశారు.

**సంక్షిప్త స్కోర్లు:**

ఈస్ట్ జోన్: 708 & 388/7 డిక్లేర్డ్ (మహమ్మద్ ఖురేషి 116 నాటౌట్, ఇషాన్ కిషన్ 80; ఎండీ నిధీష్ 2–28)

సౌత్ జోన్: 336 (తిలక్ వర్మ 99; ముఖేశ్ కుమార్ 3–62)





### 'టీమిండియాకు దూరమైన తర్వాత ఆకలి పెరిగింది'..

**దులీప్ ట్రోఫీ విజయం తర్వాత ఇషాన్**

దులీప్ ట్రోఫీలో ఈస్ట్ జోన్ 13 ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియంలో జరిగిన ఫైనల్లో సౌత్ జోన్‌పై ఆధిపత్యం ప్రదర్శించి టైటిల్ సొంతం చేసుకుంది. ఈ విజయానికి జట్టు సమష్టి కృషి, ఐక్యతే కారణమని కెప్టెన్ ఇషాన్ కిషన్ చెప్పాడు. "ఈ విజయం మా అందరిదీ. ఒకరికొకరం అండగా నిలిచాం. అదే ఈ జట్టు బలం. నాయకుడిగా నేను కూడా నా వంతు బాగానే చేశాననుకుంటా" అంటూ ఇషాన్ నవ్వుతూ చెప్పాడు. అయితే విజయంతో ప్రయాణం ముగియదని అన్నాడు. బ్యాటింగ్, ఫీల్డింగ్ ఇలా అన్ని విభాగాల్లో ఇంకా మెరుగుపడాల్సి ఉందని తెలిపాడు. ఫైనల్లో ఇషాన్ కిషన్ కీలక పాత్ర పోషించాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 270 పరుగులతో భారీ ఇన్నింగ్స్ ఆడాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ 80 పరుగులు చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో లభించిన భారీ ఆధిక్యంతో ఈస్ట్ జోన్‌కు విజయం ఖాయమైంది. దీంతో 2012–13 సీజన్ తర్వాత తొలిసారి దులీప్ ట్రోఫీని గెలుచుకుంది. జాతీయ జట్టుకు దూరంగా ఉన్న సమయంలో తనలో చాలా మార్పు వచ్చిందని ఇషాన్ చెప్పాడు. ఇప్పుడు మరింత ప్రశాంతంగా ఉంటున్నానని, పరిస్థితులను బాగా అర్థం చేసుకుంటున్నానని చెప్పాడు. జట్టు కోసం ఆడాలనే ఆకలి తనలో మరింత పెరిగిందన్నాడు. జట్టు కోసం ఆడడం, టైటిల్ గెలవడమే ఇప్పుడు తన లక్ష్యమని స్పష్టం చేశాడు. కెప్టెన్‌గా ఇషాన్‌కు ఇది రెండో దేశవాళీ టైటిల్. 2025–26 సీజన్‌లో సొంత రాష్ట్రం ఝార్ఖండ్‌కు సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ అందించాడు.

## 2027 ప్రపంచకప్‌లో ఆడతారా?

**రోహిత్ శర్మ సమాధానమిదే..!**



2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ ఆడతాడా? కొంతకాలంగా ఈ ప్రశ్నపై చర్చ జరుగుతోంది. దీనిపై రోహిత్ తాజాగా స్పందించాడు. అయితే తన నిర్ణయాన్ని మాత్రం స్పష్టంగా వెల్లడించలేదు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో పాల్గొన్న రోహిత్‌ను ఓ అభిమాని ఇదే విషయంపై ప్రశ్నించాడు. 2027 అక్టోబర్‌లో జరిగే ప్రపంచకప్‌లో ఆడతారా? అని అడిగాడు. దీనికి "2027 అక్టోబర్ చాలా దూరంలో ఉంది. అప్పటికి చూద్దాం" అని రోహిత్ బదులిచ్చాడు. దీంతో ప్రపంచకప్ ఆడే విషయంపై రోహిత్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టమైంది. రోహిత్ ఇప్పటికే టెస్టులు, టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. 2027 ప్రపంచకప్‌కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇదే కార్యక్రమంలో.. 2027 ప్రపంచకప్‌ను భారత్ గెలిస్తే 2024 టీ20 ప్రపంచకప్ విజయోత్సవంలా ముంబైలో బస్ పరేడ్ నిర్వహిస్తారా? అని రోహిత్‌ను అడిగారు. "ఇప్పుడు బస్ పరేడ్ సాధ్యమవుతుందని అనుకోవడం లేదు" అని సరదాగా స్పందించాడు. రోహిత్ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలను బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా గతంలో కొట్టిపారేశారు. రోహిత్ అద్భుతంగా ఆడుతున్నప్పుడు అతడి ఎంపికపై సందేహాలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. ఇంగ్లాండ్‌తో జరిగిన చివరి వన్డేలో రోహిత్ 138 పరుగులు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఊహాగానాలకు తాను ఆజ్యం పోయనని చెప్పారు.

## హర్షిత్ రాణాకు గాయం.. రెండు కీలక టోర్నీలకు యశ్ ఠాకూర్!



ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ తగిలింది. పేసర్ హర్షిత్ రాణా గాయం కారణంగా జట్టుకు దూరమయ్యాడు. అతడి స్థానంలో యశ్ ఠాకూర్‌ను ఎంపిక చేసినట్లు బీసీసీఐ గురువారం ప్రకటించింది. ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌తో పాటు 2026 ఆసియా క్రీడల్లోనూ హర్షిత్ స్థానాన్ని యశ్ భర్తీ చేయనున్నాడు. సెప్టెంబర్ 7న మ్యాచ్ సిమ్యులేషన్‌లో బౌలింగ్ చేస్తుండగా హర్షిత్‌కు 'రెక్టస్ ఫెమోరిస్ స్ట్రెయిన్' ఏర్పడింది. అంతకుముందు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో అతడు రిహాబిలిటేషన్ తీసుకుంటున్నాడు. కోలుకుంటున్న సమయంలో ఈ గాయం కావడంతో ఆఫ్ఘనిస్థాన్ సిరీస్, ఆసియా క్రీడలకు అతడిని తప్పించారు. ఈ ఏడాది హర్షిత్ గాయాలతో పలుమార్లు ఇబ్బందిపడ్డాడు. మోకాలి గాయం కారణంగా టీ20 ప్రపంచకప్‌కు దూరమైన అతడు శస్త్రచికిత్స తర్వాత ఐపీఎల్ 2026లోనూ ఆడలేకపోయాడు. జూన్‌లో పునరాగమనం చేశాడు. జులైలో ఇంగ్లాండ్ పర్యటనలో తొడ కండరాల గాయంతో మళ్లీ విరామం తీసుకున్నాడు. ఇక యశ్ ఠాకూర్ జులైలో జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్ ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. రెండు మ్యాచ్‌లు ఆడిన అతడు ఒక్కో మ్యాచ్‌లో రెండేసి వికెట్లు తీశాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్ సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో ఢిల్లీలో జరగనుంది. ఆసియా క్రీడలు సెప్టెంబర్ 19 నుంచి జపాన్ లోని ఐచి-నాగోయాలో ప్రారంభం కానున్నాయి. భారత జట్టు క్వార్టర్ ఫైనల్‌ను సెప్టెంబర్ 28న ఆడనుంది. హర్షిత్ స్థానంలో రెండు జట్లలోనూ యశ్ ఠాకూర్‌కు చోటు దక్కింది. భారత్‌కు 2026 ఆసియా క్రీడల్లో నేరుగా క్వార్టర్ ఫైనల్ బెర్త్ లభించింది. ఎందుకంటే భారత్ 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో పురుషుల క్రికెట్‌లో స్వర్ణ పతకం సాధించి డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. ఐసీసీ ర్యాంకింగ్ కారణంగా, ఈ టోర్నమెంట్ ఫార్మాట్‌లో భారత్‌తో పాటు పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లకు నేరుగా క్వార్టర్‌ఫైనల్ అవకాశం ఇచ్చారు. అందువల్ల భారత్ గ్రూప్ మ్యాచ్‌లు ఆడకుండా సెప్టెంబర్ 28న నేరుగా క్వార్టర్‌ఫైనల్ ఆడనుంది. ఆఫ్ఘనిస్థాన్ టీ20లకు భారత జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), శివమ్ దూబే, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, యశ్ ఠాకూర్. బుమ్రా, నితీశ్, వాషింగ్టన్ సుందర్ ఫిట్‌నెస్‌కు లోబడి అందుబాటులో ఉంటారు.


## టీమిండియాకు డబుల్ గుడ్ న్యూస్.. జట్టులోకి ఇద్దరు ఆల్‌రౌండర్లు



ఆఫ్ఘనిస్థాన్‌తో టీ20 సిరీస్‌కు ముందు టీమిండియాకు ఊరట లభించింది. స్టార్ ఆల్‌రౌండర్లు వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి గాయాల నుంచి పూర్తిగా కోలుకుని తిరిగి జట్టులోకి చేరారు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో నిర్వహించిన ఫిట్‌నెస్ పరీక్షల్లో వీరిద్దరూ ఉత్తీర్ణులయ్యారు. వీరు గురువారం ఢిల్లీలో జట్టుతో కలవనున్నారు. గత జులైలో ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్ సందర్భంగా సుందర్ తొడ కండరాల గాయంతో జట్టుకు దూరమయ్యాడు. ఇక జూన్‌లో స్వదేశంలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్ అనంతరం నితీశ్ కుమార్ రెడ్డి క్వాడ్రిసెప్స్ గాయానికి గురయ్యాడు. తాజాగా వీరిద్దరూ పూర్తి ఫిట్‌నెస్ సాధించడంతో జట్టు యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది. ఈనెల 13 నుంచి ఆఫ్ఘనిస్థాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ఇబ్రహీం జద్రాన్ నేతృత్వంలోని ఆఫ్ఘన్ జట్టుతో భారత్ ఆడనున్న తొలి ద్వైపాక్షిక టీ20 సిరీస్ ఇదే. ఈ సిరీస్‌లో శ్రేయస్ అయ్యర్ భారత జట్టు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. మరోవైపు, మోకాలి గాయంతో బాధపడుతున్న జస్‌ప్రీత్ బుమ్రా లభ్యతపై ఇంకా స్పష్టత రాలేదు. హర్షిత్ రాణా కూడా ఇంకా కోలుకోకపోవడంతో, వీరి స్థానంలో స్థానిక పేసర్ ప్రిన్స్ యాదవ్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉంది. ఇక చెన్నైలో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్ ముగిసిన అనంతరం ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మ జట్టుతో చేరుతారు. ఈ సిరీస్ తర్వాత భారత జట్టు ఈనెల 22న జపాన్‌తో టీ20 మ్యాచ్ ఆడి, ఆ తర్వాత ఆసియా క్రీడల్లో పాల్గొననుంది.

# ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ మూవీ మందాడి

సూరి, సుహాస్ మెయిన్ లీడ్స్ గా తెరకెక్కిన తమిళ్ సినిమా 'మందాడి'. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్ పై ఎల్రెడ్ కుమార్ నిర్మాణంలో మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమాలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్.. పలువురు కీలక పాత్రలను పోషించారు. మందాడి సినిమా నేడు సెప్టెంబర్ 10న తమిళ్, తెలుగులో రిలీజ్ అయింది. కళింగపట్నంను సట్టపులి(సుహాస్) రూల్ చేస్తూ ఉంటాడు. ఆ ఊళ్ళో సముద్రంలో జరిగే పడవపోటీలు ఎన్నో ఏళ్లుగా చాలా ఫేమస్. 20 ఏళ్లుగా సట్టపులి సునామి రైడర్స్ టీమ్ తో ఆ ఊరిని గెలిపిస్తూ ఉంటాడు. శ్రీను(రవీంద్ర విజయ్) కొడుకు మల్లేష్(మిథున్ జై శంకర్) పడవల పోటీకి సంబంధించిన ఓ విషయంలో గొడవ జరిగి సట్టపులి కొడుకుపై దాడి చేస్తాడు. అది మిస్ అవ్వడంతో ఓ అమ్మాయి సాయంతో హైదరాబాద్ లో ఉన్న ముత్తు కాళీ(సూరి) దగ్గర తలదాచుకుని ఉంటాడు. ముత్తుకాళీ పెళ్లి చేసుకోకుండా సింగిల్ గా ఉంటూ ఓ స్విమ్మింగ్ పూల్ లో పనిచేస్తూ ఉంటాడు. కానీ సట్టపులి మనుషులు మల్లేష్ ని చంపడానికి అక్కడికి కూడా రావడంతో 20 ఏళ్లుగా ఊరికి వెళ్లని ముత్తుకాళీ మల్లేష్ ని తీసుకొని ఊరికి వస్తాడు. అక్కడ పెద్దలు సట్టపులికి ముత్తుకాళీ మధ్య రాజి కుదర్చాలని ట్రై చేసినా అక్కడ పెద్ద గొడవ అవుతుంది. దాంతో కళింగపట్నం నుంచి రెండు టీమ్స్ పోటీ చేయాలి ఎవరు ఓడిపోతే వాళ్ళు ఆటని వదిలేయాలి అని నిర్ణయిస్తారు. పోటీకి కొన్ని రోజులు సమయం ఉండటంతో కొత్తవాళ్లకు ముత్తుకాళీ తన కళింగ వారియర్స్ టీమ్ గా ట్రైనింగ్ ఇస్తూ ఉంటాడు. సట్టపులి, అతని కొడుకు పోటీ ఎలాగైనా గెలవాలని కుట్రలు పన్నుతూ ఉంటారు. ఓ ప్రాక్టీస్ మ్యాచ్ లో ముత్తుకాళీ టీమ్ పడవ బోల్తా పడి పోటీలో ఉన్నవాళ్లు హాస్పిటల్ పాలవుతారు. దీంతో కళింగ వారియర్స్ కి పోటీల్లో ఎలా పాల్గొనాలో అర్థం కాదు. మరోవైపు 20 ఏళ్ళ క్రితం ముత్తుకాళీ ఒకప్పుడు తన తల్లి ఏంజిల్ (మహిమా నంబియార్)ని ప్రేమించిన వ్యక్తి అని తెలిసి మల్లేష్ ముత్తుకాళీ పై కోపంగా ఉంటాడు. అసలు 20 ఏళ్ళ క్రితం ఆ ఊళ్ళో ఏం జరిగింది? బెస్ట్ ఫ్రెండ్స్ గా ఉండే సట్టపులి -- ముత్తుకాళీ శత్రువులు ఎలా అయ్యారు? ఏంజిల్ -- ముత్తుకాళీ ప్రేమ ఎందుకు విఫలమైంది? పోటీలో గెలవడానికి సట్టపులి చేసే కుట్రలు ఏంటి? ఫైనల్ పోటీలో ముత్తుకాళీ టీమ్ గెలుస్తుందా? సముద్రంలో జరిగే సంఘటనలు ఏంటి.. ఇవన్నీ తెలియాలంటే తెరపై చూడాల్సిందే.



# అతన్ని ప్రేమించి మోసపోయా..

విలక్షణ నటిగా గుర్తింపు తెచ్చుకుని దక్షిణాదిలోని అన్ని భాషల్లో సత్తా చాటుతున్నారు ఐశ్వర్య లక్ష్మీ. నటనే కాదు ఏ విషయంపై అయినా కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడటం ఆమె స్టైల్. ఎవరు ఏమనుకున్నా సరే తన మనసులో ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు ఐశ్వర్య. కొద్దిరోజుల క్రితం పెళ్లి, సహజీవనం విషయంలో ఆమె మాట్లాడిన మాటలు హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా రిలేషన్‌పై ఐశ్వర్య చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. కేరళకు చెందిన ఐశ్వర్య లక్ష్మీ.. మెడిసిన్ చదువుకున్నారు. అయితే డాక్టర్ కాకుండా యాక్టింగ్ వైపు వచ్చారు. అప్పటికే మోడలింగ్ చేస్తూ పలు టాప్ బ్రాండ్స్‌కు సంబంధించిన వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 2017లో నవిన్ పాలే సరసన నటించే అవకాశం ఐశ్వర్యకు దక్కింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి గుర్తింపు రావడంతో పాటు మలయాళ, తమిళ భాషల్లో అనూహ్యంగా బిజీ అయ్యారు. మాయానంది, వారాతన్, పొన్నియన్ సెల్వన్, అమ్ము, కుమారి, గట్టా కుస్తీ, హలో మమ్మీ, మామన్ సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. సత్యదేవ్ హీరోగా వచ్చిన గాడ్సే మూవీ ద్వారా తెలుగు వారిని పలకరించారు ఐశ్వర్య లక్ష్మీ. ఈ ఏడాది తమిళంలో గట్టా కుస్తీ 2 సినిమాతో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం సాయిధరమ్ తేజ్ సరసన సంబరాల ఏటి గట్టు, మలయాళంలో ఆశా సినిమాలలో ఆమె నటిస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఐశ్వర్య.. తన సినిమాలు, షూటింగ్స్, ఇతర వ్యక్తిగత వివరాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. 35 ఏళ్లు దాటి 40వైపు చేరుకుంటున్నా ఇంకా పెళ్లి చేసుకోకుండా బ్యాచిలర్‌గానే ఎంజాయ్ చేస్తున్నారు ఈ ముద్దుగుమ్మ. పలుమార్లు ఐశ్వర్య లక్ష్మీ ప్రేమలో పడినట్లుగా రూమర్స్ రాగా.. వాటిని ఆమె ఖండించారు. నేను సింగిల్‌గా చాలా హ్యాపీగా ఉన్నాను.. నన్ను డబుల్ చేసేందుకు ప్రయత్నించొద్దని ఫ్యాన్స్‌పై విరుచుకుపడింది ఐశ్వర్య. జీవితంలో నేను పెళ్లి చేసుకోను.. ఎంతోమంది సన్నిహితులను చాలా దగ్గరి నుంచి చూశా. పెళ్లి కారణంగా కలల్ని చంపుకుని, వ్యక్తిగతంగానూ వారు ఎదగలేకపోతున్నారు. ఇవన్నీ చూసి, ఆలోచించి జీవితంలో పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకున్నాను. సంతోషకరమైన జీవితాన్ని గడపటానికి పెళ్లి అనేది తప్పనిసరి కాదు. పెళ్లి చేసుకుని విడిపోవడం కంటే, సహజీవనం బెస్ట్ అని ఐశ్వర్య లక్ష్మీ బోల్డ్ కామెంట్స్ చేశారు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి, ప్రేమపై ఐశ్వర్య లక్ష్మీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నేను గతంలో ఓ రిలేషన్‌లో మోసపోయా, స్వతహాగా నేను ఆకర్షణలకు లొంగను, అలాంటి ఓ వ్యక్తిని పూర్తి నమ్మి అతని చేతిలో మోసపోయా. ఈ రిలేషన్ ముగిసిన తర్వాతే నా చుట్టూ ఏం జరుగుతుందో తెలుస్తోంది. ఓ మహిళ నన్ను కలిసిన తర్వాతే అతని మోసం బయటపడింది. ఇందులో తన తప్పు లేకపోవడం వల్లే ఆమెపై నాకెలాంటి కోపం రాలేదు. ఈ విషయం గురించి రెండు రోజులు మాత్రమే బాధపడ్డా.. ఆ తర్వాత దానిని మరిచిపోయానని ఐశ్వర్య లక్ష్మీ పేర్కొన్నారు.



# సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన స్వగత కృష్ణన్

తమిళ సినీ పరిశ్రమలో ఓ పోస్ట్ చర్చనీయంగా మారింది. ప్రముఖ గాయని స్వగత కృష్ణన్ చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పేరు ప్రస్తావించకుండా ఓ వ్యక్తిపై ఆమె సంచలన ఆరోపణలు చేసింది. ఆ వ్యక్తి మహిళలపై లైంగిక దాడులు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్, బలవంతపు మత మార్పిడి చేశాడని, అలాంటి వ్యక్తికి ఇండస్ట్రీ కి సపోర్టుగా నిలిచిందని అసంతృప్తి వ్యక్తం చేసింది.సింగర్ స్వగత కృష్ణన్ గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తనకు ఎదురైన చేదు అనుభవాలను వెల్లడించింది. ఓ సంగీత దర్శకుడి స్టూడియోలో తనను లైంగిక వేధించాడనీ, స్టూడియోలో సౌండ్‌ప్రూఫ్ గది, సీసీటీవీ కెమెరాలు ఉన్నాయని.. అక్కడ జరిగిన ఘటనను రికార్డు చేసి, ఆ ఫుటేజ్‌ను ఉపయోగించి తనను బెదిరించారని ఆమె పేర్కొన్నారు. తనకు మాత్రమే కాకుండా మరికొంతమంది మహిళలకు కూడా ఇదే వ్యక్తి వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని స్వగత ఆరోపించారు. ఈ పరిణామాల కారణంగానే తాను చెన్నైని విడిచి రిషికేశ్‌కు వెళ్లినట్లు వెల్లడించారు. ఇప్పుడు స్వగత చేసిన తాజా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీతో ఆ వ్యవహారం మరోసారి చర్చలోకి వచ్చింది. పేరు చెప్పకుండా ఓ వ్యక్తిపై సంచలన ఆరోపణలు చేసింది. పలువురు బాధిత మహిళలు ఆరోపణలు చేసినప్పటికీ ఆ వ్యక్తికి సినీ పరిశ్రమలో మద్దతు లభిస్తుంది. ఆ వ్యక్తి ప్రస్తుతం తన సామాజిక ప్రతిష్ట, పీఆర్, ప్రజాభిప్రాయం గురించి ఇంటర్వ్యూలు ఇస్తుండటం ఎలా సాధ్యమవుతోందని ఆమె ప్రశ్నించారు. ఒకవైపు ఇలాంటి ఆరోపణలు ఉండగా.. మరోవైపు పరిశ్రమలో అతడికి గౌరవం, స్వాగతం లభిస్తుండటంపై ఆమె అసంతృప్తి వ్యక్తం చేసింది. స్వగత తాజా పోస్టులో మరో కీలక విషయాన్ని ప్రస్తావించింది. ఆ వ్యక్తి ప్రస్తుతం ఓ భక్తి ప్రధానమైన సినిమాకు సంగీతం అందిస్తున్నారని తెలిపింది. ఈ ఒక్క అంశం సోషల్ మీడియాలో చర్చకు మరింత ఆజ్యం పోసింది. అంతే కాదు.. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని బహిరంగ కార్యక్రమాలకు ఆహ్వానించడం, వేదికపై అతడికి కేక్ తినిపిస్తున్నారనీ తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో సినీ పరిశ్రమ ఎవరి పక్షాన నిలబడుతుందనీ ప్రశ్నించింది. ఇక చివరిలో 'నెక్ట్స్..' అంటూ తన ట్వీట్ ముగించింది సింగర్ స్వగత. ఇలాంటి ఉత్కంఠ రేపడంతో త్వరలో మరిన్ని వివరాలను వెల్లడించబోతున్నారా? ఇప్పటివరకు చెప్పని విషయాలను బయటపెట్టబోతున్నారా? అనే చర్చ మొదలైంది. ఇప్పటికే ఆమె గత ఆరోపణలపై కూడా సోషల్ మీడియాలో చర్చ జరిగిన నేపథ్యంలో.. తాజా పోస్టు మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా ఆమె తదుపరి పోస్టులో ఏదైనా వ్యక్తి పేరు లేదా కీలక ఆధారం బయటపెడతారా అన్నదే ఇప్పుడు ఉత్కంఠగా మారింది.





# స్టైల్‌ని బాగానే వాడేశారు

కంటెంట్ ఉన్నోడికి కటౌట్ చాలు.. ఈ సినిమా డైలాగ్‌ను సినిమాలకే ఆపాదిస్తే.. 'కంటెంట్ మీద నమ్మకం తక్కువ ఉన్నప్పుడు కాంట్రవర్సీ చాలు' అని మార్చొచ్చు. ఇది ఏ ఒకరినో ఉద్దేశించి అన్న మాట కాదు. ఇప్పటివరకు టాలీవుడ్‌లో జరిగిన సినిమా కాంట్రవర్సీలు, ఆ తర్వాత ఆ సినిమాలు పొందిన లాభాలు చూసి అన్నమాట ఇది. ఇక్కడ పేర్లు చెప్పం కానీ.. యువ హీరోలు.. యువ స్టార్ హీరోలు, యువ ప్రామిసింగ్ హీరోలుగా మారడానికి ఈ స్టైల్‌ని బాగానే వాడేశారు. ఇప్పుడు ఎందుకు ఈ చర్చ అనుకుంటున్నారా? ఇప్పుడు టాలీవుడ్‌లో రిలీజ్‌కి రెడీ అవుతున్న ఓ సినిమాకు సంబంధించి ఇదే మాట వినిపిస్తోంది. సమాజంలో చర్చని లేవనెత్తే సినిమా ఇది. ఎంతగా చర్చ జరిగితే మా సినిమాకి అంత మంచిది. ట్రైలర్ విడుదలైన వెంటనే మా సినిమాపై చర్చ మొదలైంది. అది మంచిదే. ఒక రకంగా ట్రైలర్‌తో మేం ప్రేక్షకుల్ని ముందుగానే సిద్ధం చేశాం అని హీరో ఆ సినిమా గురించి ఇటీవల మాట్లాడారు. ఈ మాటల వెనుక అర్థం డిస్కషన్ ఆ తర్వాత ఫుట్‌ఫాల్స్ అని అర్థమవుతోంది. ఇక ఆ సినిమా నిర్మాత అయితే.. సినిమాలో ప్రేక్షకులు ఊహించని విషయాలు, షాకులు మరిన్ని ఉంటాయనేలా మాట్లాడారు. ప్రేక్షకులను ముందే ప్రిపేర్ చేసే ప్రయత్నం ఇది అనిపిస్తోంది. ఈ సినిమాకు రెగ్యులర్ సినిమాల తరహా ముగింపు ఉండదని చెప్పిన నిర్మాత.. సినిమా ఉన్నట్లుండి, ఆగిపోయినట్లు అనిపిస్తుందని, ప్రేక్షకులు అనుకున్నట్లుగా క్లైమాక్స్ ఉండదని చెప్పారు. అలాగే కాస్త 'అతి' డైలాగ్‌లు అనిపించుకున్నవి సినిమాలో ఇంకా బాగుంటాయి అని కూడా చెప్పారు. ఈ సినిమాలోని సీన్స్, మాటలు ఇప్పటివరకు ఎక్కడా చూసి ఉండరని.. అంత సహజంగా తీశారని కూడా ఆ నిర్మాత చెబుతున్నారు. ఇదంతా చూస్తుంటే సినిమా విడుదల తర్వాత 'బేబీ' తరహా చర్చ, రచ్చ అయితే పక్కా అనిపిస్తోంది. మరి ఏమవుతుందో చూడాలి.

PRINTED, PUBLISHED & OWNED By Rolla Raghunath Reddy, PRINTED at Teja Cards & Stationery (Printing & Stationery Supplyers) #78-1-26, Thunnuguntla Vari Street Lalapeta, Guntur - 522001.
EDITOR : Rolla Raghunath Reddy, #4-6-13, Library Road, Koritipadu 1st Lane, Near RCM School, Chandramoulinagar Guntur - 522007. Andhra Pradesh. E-mail: bharathprathinidhi@gmail.com Phone No: 8121214342